
# చాతుర్వర్ణ్యవ్యవస్థ - కులములు మత సామరస్యము

(భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి దివ్య ప్రబోధములు)



సంకలనము

**తూములూరు ప్రభ**

**తూములూరు కృష్ణమూర్తి**

# మతములన్నియు వేరు మార్గమొకటే!

**మతమంటే** మూర్ఖ పెడవాదముతో కూడుకొనిన అంధ విశ్వాసము కాదు. **మానవుడు తన గమ్యస్థానమైన పరమాత్మ సాన్నిధ్యమును చేరుకొనునట్టి మార్గమే మతము. పరిపూర్ణతను పొందుట కొరకు మనావుడు చేసే అతి దీర్ఘమైన ప్రయాణములో అత్యంత అవసరమైనట్టి ప్రవర్తనే మతము.** అందుచేతనే పైకి వివిధ విరుద్ద సిద్ధాంతములు కలిగి ఉన్నట్లుగా మతములు కనిపించునప్పటికి వాస్తవములో అవి ఒకదానినొకటి ధిక్కరించుట కానీ, ఒకటి బోధించిన ధర్మము మరొకటి కాదనుట కానీ, పరస్పరము ఖండించుకొనుట కాని చేయవు. మానవులు నిత్య జీవితములో తమ తమ స్వభావములకు, పద్ధతులకు అనుగుణ్యాముగా సంపూర్ణతను చేరుకొనవలెననే ఒకే అభిలాష కలిగి ఉంటారు. ఈ అభిలాష సాఫల్యము కొరకు అనుసరించే పద్ధతులు వారి వారి స్వభావముల ననుసరించి ఆచరించే విధానములు భిన్నముగా ఉండుటచేతనే నేడిన్ని మతము లేర్పడినవి.

ఈ విధముగా మనము **మతములందు పైకి కనిపించే వైవిధ్యములను చక్కగా అవగాహన చేసికొని అన్వయము చేసినట్లయిన మానవుడనుభవించడానికి మతము చూపించే స్వేచ్ఛ కాక మరొక స్వేచ్ఛకు అవకాశము లేదని చెప్పవచ్చును.**


మతమనగా మరేమీకాదు, **మానవునికి భగవంతునియందున్న భక్తి ప్రపత్తుల వైఖరే మతము,** ఈ వైఖరి మానవునకు, భగవంతునికి మధ్య ఏర్పడిన సంబంధము మీద ఆధారపడి ఉంటుంది. జ్ఞాని వైఖరి ఒకటి, కర్మపద్ధతి...ఒకటి, భక్తిమార్గము మరొకటి భక్తి అనేది భిన్న వ్యక్తులలో భిన్న రూపములు దాలుస్తుంది. ఈ వ్యత్యాసములకు కారణం మానవుడు తనకు భగవంతునికి మధ్యనున్న సంబంధమును గురించి భావించుటలో కల్పన చేసికొనుటలో అనుసరించు మార్గములో భిన్నత్వము కలిగియుండుటే. **మానవుడు ఏ మార్గమునైనా నిష్కల్మష హృదయముతో, నిర్మల భావనతో శరణాగతుడై అనుసరించిన యెడల గమ్యముచేరుకొనుట తథ్యము**

**- బాబా**

ఓం

# చాతుర్వర్ణ్యవ్యవస్థ - కులములు
# మత సామరస్యము

(భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి దివ్య ప్రబోధములు)



<u>సంకలనము</u>

తూములూరు ప్రభ

తూములూరు కృష్ణమూర్తి

చాతుర్వర్ణ్యవ్యవస్థ - కులములు - మత సామరస్యము

ప్రథమముద్రణ - 2003

ప్రతులు - 1000

వెల - రూ. 15/-

ప్రచురణ :
తూములూరు పబ్లికేషన్స్
"అనసూయ" సి - 66, దుర్గాబాయి దేశ్‌ముఖ్ కాలనీ,
హైదరాబాదు - 500 007. ఫోన్ : 27614083, 27631904.
Emai : tumuluru@hd1.vsnl.net.in

ప్రతులకు :
శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్ ట్రస్టు
ఆంధ్రప్రదేశ్, 'శివం' నల్లకుంట, శివం రోడ్డు,
హైదరాబాదు - 500 044.

సంకలనము :
తూములూరు ప్రభ
తూములూరు కృష్ణమూర్తి
ఫోన్ : 040-27614083, 27631904.
Emai : tumuluru@hd1.vsnl.net.in

డి.టి.పి.
ఫాంట్‌లైన్ గ్రాఫిక్స్, బాగ్‌లింగంపల్లి
హైదరాబాద్ - 44 ఫోన్ : 27660000

Printed at :
**SAIRAM PRINTERS, HYDERABAD.**
**Phone : 040-23232316, 23237598**

# ముందుమాట

శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీత (నాలుగవ అధ్యాయము 13వ శ్లోకము)లో అర్జునునకు ఈ విధంగా ఉపదేశించాడు. (అంటే మానవమాత్రులందరిని ఉద్దేశించిన ఉపదేశముగా గ్రహించాలి) ఆది నారాయణుడు నరునకు చేసిన ఉపదేశము.

**"చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణ కర్మ విభాగశః**
**తస్యకర్తార మపిమాం విద్ధ్యకర్తార మవ్యయమ్॥**

"ధర్మ సంస్థాపనకు తగినది ఒకటి కలదు. దానిని చాతుర్వర్ణ్యమని అందురు. ఇది ప్రజల కర్మలనూ, గుణములనూ అనుసరించి, నాలుగు విధములుగా సృజించి యున్నాను. ఈ వ్యవస్థ సృష్టి సంచాలనమునకు అత్యావశ్యకము."

వర్ణవ్యవస్థను సరియయిన మార్గమున పోషించకుండుటే, ఈ నాటి దురవస్థకు కారణము. దానిని వక్ర మార్గమున, స్వార్థస్వప్రయోజనములకొరకు కొత్త కొత్త కులములని చెప్పుతూ ప్రజలలో భేద భావములు లేవనెత్తి వారల మధ్య రాజకీయములు చేర్చుట చేత, ఐకమత్యము అంతరించింది. దేశ పురోగమనము బదులు తిరోగమనమవుతుంది. దేశక్షేమమునకు ముప్పువాటిల్లు తుంది. కులమతభేదాలతో అమాయక ప్రజలు భయాందోళనలకు గురి అయి అశాంతితో ఉంటారు. అరాజకము ఏర్పడుతుంది.

కులమత ద్వేషాలు కూలద్రోయాలి. దేశక్షేమమే ముఖ్యం. ఇది దృష్టి యందుంచుకోవలెను.

భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు చిన్న తనం నుండి, తను బుక్క పట్టణం స్కూల్లో ప్రార్థనాగీతంగా పాడిన పాట మత సామరస్యమును బోధించు తున్నది. అన్నిమతములు చేరి మంచినే బోధించును. మతులు మంచివైన మతమేమి చెడ్డది అన్నారు.

'ఏకం సత్ విప్రా : బహుధావదంతి'. సత్యము ఒక్కటిగానే ఉంది. దానిని అనేకరీతులలో బుధులు వర్ణించారు. దేవుడు ఒక్కడే, ఆత్మఒక్కటే. అందరిలోనున్నది ఆ ఆత్మే. అన్ని మతముల వారు కులములవారు ప్రార్థించేది ఆదేవుణ్ణే అయితే ఆ దేవుళ్ళ నామరూపాలు వేరుగా ఉండవచ్చు. తోచవచ్చు. అందుకే **"మతములన్నియు వేరు మార్గంబు ఒక్కటే శృంగారములు వేరు బంగారమొక్కటె...పూలజాతులు వేరు పూజ ఒక్కటే..."** అన్నారు. **"సహస్ర శీర్షా పురుషస్సహస్రా స్సహస్రపాత్" - 'ఈ శావాస్య మిదం జగత్', 'ఈశ్వరసర్వభూతానాం.'**

- 'ఏకోవసిసర్వభూతాంతరాత్మ' అని గ్రహించి వర్తించాలి. Religion అంటే Realisation. ఏమిటా Realisation? అదే ఏకత్వభావం. అదే Realisation is Love.

అందువలన మనము ఐకమత్యముతో కులమత సామరస్యముతో మెలగాలి. **మంచిహిందువుగా మంచిక్రైస్తవుడుగా మంచి ముస్లింగా మానవుడుగా మానవునిలోని మాధవుని దర్శించు కుంటూ కలసి మెలసి మెలగాలి.** కులమతాలలో రాజకీయాలు తీసుకొని రాకూడదు. అందరిదీ ఒకే కులం అదే మానవజాతి.

**"ఒకేజాతి - అదే మానవ జాతి**

**ఒకే కులము - అదే ఆధ్యాత్మిక కులము**

**ఒకే భాష - అదే హృదయ భాష**

**ఒకే దైవము - అదే నిజమైన దివ్యత్వము."**

సర్వేజనా : సుఖినోభవంతు, లోకాస్సమస్తా సుఖినోభవంతు అని ప్రార్థించాలి.

దీనిని దృష్టిలో ఉంచుకొని, స్వామి అనుగ్రహించిన ప్రబోధలు చాతుర్వర్ణ్యవ్యవస్థ (కులములు), ఉపాసనలు, మతములు సామరస్యము గురించి ఇందు సేకరింపబడినవి.

మన మందరం సాయి మతమును అనుసరించుదాము, **'కరిష్యేవచనం తవ'** అని. "అన్ని మతాలను ఒక్కటిగా చేర్చేది అన్ని మతాలలోను సామాన్యముగా ఉన్న గొప్ప తనాన్ని గురించి వివరించేదే తెలిపే సాయి మతం. సాయిమతము సర్వమత సామరస్యమును బోధించును"

అదే సర్వేశ్వరుని సేవ, పూజ. భగవాన్ ప్రబోధములను ఆచరణలో పెట్టి అనుగ్రహం పొందుదాం.

భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి చరణారవిందములకు ప్రణమిల్లుతూ

హైదరాబాదు
16.5.2003

**తూములూరు ప్రభ**

**తూములూరు కృష్ణమూర్తి**

# చాతుర్వర్ణ్య వ్యవస్థ (కులములు)

## లోకక్షేమమునకు వర్ణవ్యవస్థ

ధర్మసంస్థాపనకు తగినది ఒకటి కలదు. దానినే చాతుర్వర్ణ వ్యవస్థ యని యందురు. **ఇది ప్రజల కర్మలనూ గుణములనూ అనుసరించి నాలుగు విధముల సృజించి యున్నాను.**

"ఈ వర్ణవ్యవస్థ సృష్టి సంచాలనమునకు అత్యావశ్యకము. దీని అంతరార్ధమును ప్రజలు అంత సులభముగా గ్రహించుకొనలేరు. ఏదో ఈవర్ణములు మానవులను అనేక విధముల బాధించి భేదములు కల్పించుచున్నవని అజ్ఞానులు తలంతురు. విషయ విచారణద్వారా పరిశోధించిన పదార్ధముయొక్క యదార్ధము బైటపడును. **కాని పరిశోధన సలుపక వర్ణ భేదము సరియైనదికాదని వాదించిన, విషయము తెలియని వాదన, వివేకములేని రోదన, విశ్వాసములేని వేదనగా మారును, లోకక్షేమమునకే ఈ వర్ణములు నేను కల్పించితిని కాని లోక క్షామమునకు కాదు. ఈ వర్ణమువలన మానవుడు తన కభిరుచియగు కర్మల నాచరించి పూర్ణమును పొందుచున్నాడు.** వర్ణ నిబంధనలు లేనిది మానవుడు ఒక నిమిషమూ సుఖపడడు. **మానవుని కర్మలకు వర్ణములు ప్రాణము వంటివి.**

## గుణములు

దృశ్య కల్పితమైన జగత్తు త్రిగుణాల వికారము చేత ఏర్పడి, పోషింపబడుచున్నది. జగత్తంతా త్రిగుణాల స్వరూపము; నాటకమే. ఈ ప్రపంచానికి గుణములే ప్రాణములు. గుణముల కార్యకలాప సముదాయము ప్రపంచము.

**సత్వగుణము** : పుణ్యఫలమును భగవంతునికి అర్పించినప్పుడది సార్థకమవుతుంది. ఇది పరిశుద్ధమైనది. కనుక దీనిని శుద్ధ సత్వమంటారు. తెలుపు దీని స్వరూపము. జగత్తులో జన్మించిన ప్రతి జీవిలో సత్వరజస్తమోగుణ నిరూపణ జరుగుతూనే ఉంటుంది. ఈ గుణముల బట్టే క్రియలు జరుగుతూ ఉంటాయి. దీనిని పురస్కరించుకొనే గుణ కర్మవిభాగం చేశారు.

**రజోగుణము** : వాంఛ నెరవేరెనా సంతృప్తి అహం, విఫలమాయెనా క్రోధం. 'వాంఛ నెరవేరినా, విఫలమయినా దుర్గుణాలే ఆవిర్భవిస్తాయి. కాని మంచి ఫలితాలు ఏర్పడవు.

కోపతాపాలు, ఆవేశం చేత ఎప్పుడూ మండిపడుతూ ఉంటాడు. రజోగుణం నిరంతర రక్తాన్ని మరగింప చేసే గుణాల్ని అభివృద్ధి పరుస్తుంది.

**తమోగుణము :** తమోగుణమంటే మూర్ఖత్వము, మందమతిత్వము, ప్రతిదానికి ప్రశ్నలు వేయటం, అందుకు ఈ మూర్ఖబుద్ధిని, మూర్ఖవాదాన్ని మొదట అరికట్టుకోవాలి. విన్న విషయాల్ని సరిగా విచారణ చెయ్యాలి. విచారణచేసిన దానిని జీర్ణించుకోవాలి. జీర్ణించుకున్నప్పుడే శక్తి వస్తుంది. వాదోపవాదాలవల్ల వైరం పెరుగుతుంది. శాంతం చేకూరదు. సత్యాన్ని గుర్తించవీలవదు. దివ్యత్వాన్ని చేరలేడు. పవిత్రత్వాన్ని అనుభవింప లేడు.

వీటిని పురస్కరించుకొనే చాతుర్వర్ణములు ఏర్పడినవి.

## భగవంతుని వరప్రసాదము

**"సాత్త్విక గుణము ద్వారా బ్రహ్మతత్త్వమును తెలిసికొని లోకమునందు ఆధ్యాత్మిక, నైతిక, ప్రగతిజీవనమును ప్రేరేపించి స్వస్వరూప సందర్శన భాగ్యమును కలిగించునట్టివారలను బ్రాహ్మణులనియు, రాజ నీతిని, శాసన వ్యవస్థను, దేశ క్షేమమును, ధర్మమును రక్షించెడి దృష్టితో దుష్టులను దుర్మార్గుల నుగ్గడించుచూ అసహాయ దీనులైన దుర్బలులను కాపాడుచూ అట్టివారలకు చేదోడు వాదోడుగా వుండి పరిపాలన చేయు వారలను క్షత్రియు లనియూ, పాడి పంటతో న్యాయబద్ధమైన వృత్తి వ్యాపారములతో వృద్ధినొందించుచూ లోకములో సామాన్య ప్రజలకు తగిన ఆహార సదుపాయములను అందించుచు, ప్రజా దేహ పోషణకు సాధ్యమైనంత సదుపాయములను కల్పించువారలనే వైశ్యులనియు;**

**ప్రపంచ శ్రేయమునకు పునాదులు వేయుచు సేవాకర్మల నాశ్రయించి పైమూడు వర్ణముల వారినీ అనుసరించి వారలకు తగిన బలమును అందించువారలను శూద్రులనియూ, నాలుగు వర్ణములను నిర్మించితిని.** ఇట్లు వారి వారి విహిత విధాన కర్మలను ఆచరించుచున్న లోకము కాని సమాజము కాని సర్వతోముఖ వికాసమును పొందును. ఇట్టి నిబంధనలు ఉండుటచే శ్రమ విభాగములు జరిగి వ్యక్తి సమాజ జీవితములో ఒడు దుడుకులు లేక హాయిగా వుండగలడు" అని వర్ణవ్యవస్థను వివరించెను.

ఇట్టి వర్ణ విభాగములు **భగవంతుడు భారతీయులు కొసగిన వర ప్రసాదము.** భారతీయులెంతటి అదృష్టవంతులో! భగవంతుని అనుగ్రహమునకు పాత్రులై ప్రతిచర్య భగవదాజ్ఞకు బద్ధమైనదై యుండుట మహా భాగ్యము. ఈ విషయమున మనము కొంత యోచించ వలసిన విషయము కలదు. ఇది ప్రధానమైన సమస్య.

## దుస్థితికి కారణం

భగవత్ ప్రసాదమైన వర్ణవ్యవస్థకు నేడు భయంకరమైన ప్రమాదము కలుగుచున్నది. పాలకులు గూడనూ వర్ణవ్యవస్తను రూపుమాపిన కాని లోకమునకు క్షేమమేర్పడదని వర్ణవ్యవస్థ వలననే భారతదేశ మింతటి దుస్థితికి వచ్చినదని అనేకమంది వాదించుచూ బోధించుచున్నారు.

మంచిదే! సర్వులకూ లోకక్షేమమే ప్రధానము. కాని వర్ణవ్యవస్థ వలన లోకము ఇంతమాత్రమైనా నిలువ గలిగినదా, లేక వర్ణవ్యవస్థ క్షీణించుటచేత ఈ దుర్గతి పట్టినదా? అని బుద్ధిమంతులు శాంతముగా విచారణ సలిపి పరిశోధనల ప్రమాణములచే వీటిని ప్రక్కకు నెట్టిన, తప్పక అందరూ ఒప్పుకొనదగినదే. అట్లుకాక, విచారణలు సలుపక, వివేకదృష్టితో పరిశోధించక అనుమాన ప్రమాణములతో వర్ణవ్యవస్థను నిందించుట సహించలేని విషయము.

**కొంతమంది పెద్దలు చెప్పినట్లు వర్ణవ్యవస్థలు సక్రమమార్గమునుతప్పి వక్ర మార్గమును పట్టినది వాస్తవమే. అంతమాత్రాన దానిని పారద్రోలుట న్యాయముకాదు.** చేతులు చేయవలసిన పనులు కాళ్ళు, కాళ్ళు చేయవలసిన పనులు తల చేయుచున్నదని చేతులు, కాళ్ళు, తెగగొట్టుట మంచిదికాదు. అట్లు దారితప్పిన వాటిని క్రమముతప్పినవాటిని, ఆచరణలో పెట్టుటకు ప్రయత్నించవలెను. కాని అసలుకే మోసము చేసిన అన్యాయమునకు గురియగును. అసలు యింత అరాజకమునకు మూలకారణము వర్ణవ్యవస్థ యేర్పడి కాదు. **వర్ణవ్యవస్థను సరియయిన మార్గమున పోషించకుండుటే కారణము.** వర్ణవ్యవస్థ భగవత్ ప్రసాదితమైనది. తగినరీతిగా గౌరవించక, సక్రమ మార్గమున నడిపించక, ఇష్టమొచ్చినట్లు వుపయోగించు కొనుటచే ఈ విధమైన అవలక్షణములకు దారితీసినది.

## ప్రపంచంలో ఈ వ్యవస్థ

**ఈ చాతుర్వర్ణ వ్యవస్థ ఒక మన భారతీయులకే కాక యావత్ ప్రపంచమునకు అవసరమైనది. విదేశములలో మాత్రము ఈ పద్ధతి లేకపోలేదు.** అక్కడికీ ఇక్కడికీ ఒక్క పేరు మాత్రమే వ్యత్యాసము. అక్కడ కూడనూ శిక్షక వర్గమని, రక్షక వర్గమని, వణిగ్వర్గమని, శ్రామిక వర్గమని నాలుగు రకములు కలవు.

అయితే **మన భారతవర్ణములు జన్మతో నిర్ణయింపబడినవి. విదేశీయులకు కర్మతో నిర్ణయించబడినవి. ఇదే వాటికీ వీటికీ భేదము.** ఇప్పుడు ప్రథమస్థానము ప్రతిష్టించబడిన

బ్రాహ్మణులయందు దారి తప్పి తుచ్ఛమార్గములకు వడిగట్టినవారు లేకపోలేదు. నాలుగవ స్థానమున శూద్రులనువారలయందు పవిత్రభావములు అభివృద్ధి అయి. చిత్తశుద్ధి కొరకు పాటుపడువారు లేకపోలేదు. ఇంతమాత్రమునకే వర్ణము పనికిరాదనుట ఒప్పుకోదగినది కాదు.

## భగవంతుని నాలుగు అంగములు

ఇదే వర్ణవ్యవస్థను మరి కొంతమంది వేరొక రకమున ప్రచారము సల్పుదురు. ఏదెట్లున్ననూ ఒక దేహమందుండిన అంగములవలె ఈ నాలుగు వర్ణములూ నాలుగు అంగములుగా నిలచినవి. **భగవంతుడను దేహమునందే ఉద్భవించిన అంగములే ఈ వర్ణములు.** ముఖము నుండి బ్రాహ్మణులనియూ, భుజముల నుండి క్షత్రియులనియూ, తొడల నుండి వైశ్యులనియు, పాదముల నుండి శూద్రులనియు చెప్పబడుచున్నది. అయితే దీనికి సూక్ష్మార్థము వేరు కలదు. **గురువులవలె జ్ఞానమును ఉపదేశించుటకు వాక్కువంటివాడు బ్రాహ్మణుడనియు భూభారము వహించువాడు బాహుబలుడగు క్షత్రియుడనియు, శరీరమును నిలబెట్టు తొడలవలె సంఘ సౌధమును నిలబెట్టుసమర్థుడు వైశ్యుడనియు, తిరిగి పనీ పాటు చేయుటకు పాదము లుపయోగముగునట్టితరి కృత్యములు చక్కబెట్టువాడు, శూద్రుడనియు భావము. శరీరమునకు యే అవయవములు లోటు వచ్చిననూ దాని కది కొఱతయే యగునట్లు సంఘమున కీ కార్యములు చేయువారిలో నెవరు లోటయిననూ లోపము వచ్చి క్షేమము చెడును. శరీరావయవములు అన్నియూ ఉత్తమములయినట్లు వర్ణములన్నియూ శ్రేష్ఠములయినవే.** కాలుచేతులు కడుపుపై కోపించి పనిమానుటవంటిదే వర్ణ వైషమ్యము. ఒక చక్కెర బొమ్మ నుండి వచ్చిన పదార్థములే కదా! తల గిల్లుకొని నోటిలో వేసుకొన్ననూ తీపే, కాలు గిల్లుకొని నోటిలో వేసుకొన్ననూ తీపే. **అన్నీ ఒక పరమాత్మ దేహము నుండే వచ్చిన ఈ వర్ణములను అంగములు వేరువేరుట్లగును! కర్మలు వేరు వేరు కాని రక్తనాళములూ సుఖదుఃఖములూ, అందఱికి ఒక్కటే. దేహమంతా సమాన రక్తమే ప్రవహించును** కానీ చేతులకొక రక్తము, పాదముల కొక రక్తమూ, ముఖమునకు మరొక రక్తమూ ప్రవహించదుకదా! ఇది వేదవిహితమైన సమానధర్మము కానీ కల్పితమైన మానవ నియమములు కావు. కనుక వర్ణవ్యవస్థను అర్థము చేసుకొనక, వాటివలన లోకమునకు అనేక భేదభావములు కలుగుచూ ద్వేషములకు గురి యగుచున్నట్లు తలంచుట అజ్ఞానము తప్ప వేరుకాదు.

## లోకక్షేమము కొరకు ఈ వ్యవస్థ

**వర్ణవ్యవస్థను నిర్మూలము చేసిన లోక క్షేమము కలుగునని వాదించు వారు మాత్రమే లోక క్షేమమును కోరుచున్నారని వారు భావింతురు కాబోలు; వర్ణవ్యవస్థ మంచిదని వాదించువారు లోకమునకు హాని కోరువారని వారి ఉద్దేశ్యమై యుండవచ్చును; ఇవి రెండునూ భ్రమలే.** వర్ణవ్యవస్థను వ్యతిరేకించువారికంటే వర్ణవ్యవస్థను కాపాడవలెనను వారలలోనే లోకక్షేమము నిండుగా దండిగా నుండును. అది వారు తెలసికొనలేకున్నారు. ఏదో వర్ణవ్యవస్థను నిర్మూలము చేసిన మేము దేశాన్ని కాపాడినవార మగుదమని భ్రాంతిపడుచున్నారు. అది అమాయకపు తృప్తి. వర్ణవ్యవస్థను వ్యతిరేకించువారు కానీ, పోషించవలెనను వాంఛకలవారు కానీ, చక్కగా విచారణ సల్పి మంచి చెడ్డలు స్పష్టముగా దెల్పి తదుపరి పరిపాలించుటో పాడుచేయుటో చూచు కొనవచ్చును. కాని, వూరికే విషయము తెలియని వాదనలలో విపరీతార్ధములు చెలరేగించిన వింతమార్పు కలుగును. ద్వేషము పెరుగును. అది యెవరికీ క్షేమము కాదు. యెండమావుల జలమను భ్రాంతిచేత తరుముకొని పోయినట్లు సర్వం సమానమను భ్రాంతితో సర్వులకూ అశాంతిని కలిగించుచున్నారు. ప్రజా ప్రతినిధులయిన పండితులునూ, **అనుభవజ్ఞులయిన పెద్దలను చేరి పరిపాలకులు పరిశోధనలు సలుపుట చాలా మంచిది.** కానీ వీటి విషయమే తెలిసికొనక బాహ్యకర్మలనే ప్రధానముగా పట్టుకొని ఇందులో యేదో విషయమున్నదని అదిరిపడుట అవివేక లక్షణము. **పరిపాలకులకు, పండితులకు ప్రజాక్షేమమే ప్రధానము. అసలు ఈ వర్ణములు అందరి క్షేమమునకే అవతరించినవి.** దీనిని వినియోగించు విధానములు అనుభవజ్ఞులద్వారా యోచించక, ఆచరించక ఇన్ని అపోహలకు దారి తీసినవి. ఒక చిన్న ఉదాహరణము యోచించుడు. ఇపుడు పరదేశీయులు లక్షల మందిని చంపే బాంబులు తయారుచేసినారు. అవి చెడ్డవనే తెలుసు. వాటికి ప్రభుత్వమే అనేక విధముల తోడ్పడుచున్ననూ చేసిన శాస్త్రజ్ఞుడు తెలివి తేటలు గల వాడైననూ వినియోగించే విషయమున, తిరిగి ప్రభుత్వపు అనుమతి అవసరము కదా! చెడ్డవాటికి ప్రభుత్వము సర్వసహాయము చేసిననూ అది అవసరమును బట్టి వినియోగించవలెనేకాని చేసితిమి కదా యని యిష్టమొచ్చినట్లు ఉపయోగించిన అందరికి ప్రమాదమే! **లోకమున అరాజకము సంభవించినపుడు ఆత్మరక్షణకొరకు వారివారి దేశరక్షణ కొరకు వాటిని ఉపయోగింతురేకాని లోకమునే నాశనము చేయవలెనను దృష్టి కాదుకదా!**

**అట్లే వర్ణములను** తీక్షణమైన రక్షణలను, వారివారి కర్తవ్యములను కొనసాగించి దేశమును రక్షించునట్టి ఆయుధములనే భావించవలెను. వాటిని యే యే విధముగా క్రమము తప్పక

వినియోగింతుమో భద్రపరతుమో అట్లే వాటిని ఆచరించి భద్రపరచవలెను. కానీ వాటిని హద్దూ పద్దూలేక ఇష్టమొచ్చినట్లు ఉపయోగించుటచే ఇంతటి అరాజకమునకు గురి అయినవి. కనుక **పూర్వపురుషులు, మహారాజులు, ఉత్తమ పండితులు, అనుభవజ్ఞులయిన మహానుభావులు, వీటి నెంతటి పవిత్రముగావాడి, తరించి ఇంతకాలము కాపాడుకొని వచ్చిరో ఒకపరి యోచించిన అవి మంచివా చెడ్డవా బుద్ధిమంతులకు గోచరము కాగలదు.** అవి లోకమునకు అపకారమే చేయునవయినా వారల కేమి తెలివి లేకనా, లేక ఇప్పటి కాలపు చదవు సంధ్యలు లేకనా, అసలు అమాయకులా? కాదు కాదు. వారి తెలివితేటలు, వారి బుద్ధికుశలతలు వారి ఆత్మ విద్యలూ, వారల పరిశోధనాబలములూ, ఇప్పటివారలలో వెతకినమా కొటికొక్కరిలో చిక్కవు. వారు కందమూలాదులు భక్షించి, కాయకష్టములు సలిపి, లోకక్షేమమును ప్రాణముగా భావించి, తమ తమ సర్వశక్తులనూ ధారబోసిన మహాత్యాగులు, యోగులు, యోధులు. నిజమున దేశక్షేమమునుకోరి, ఆశించి అన్ని విధములా ధీకొట్టిన మహాఋషులు, ఇప్పటి వారలవలె మాటలతో క్షేమమును కోరుచూ చేతలతో అంతా నాశనమే చేయుట పూర్వీకులకు తెలియని విద్య. ఇట్టివే నేటి నూతన భావములు, నవీన ప్లానులు; వీరి ప్లానులు గాలి మేడలు. వారివి వారికే తెలియునుతప్ప అన్యులకు అర్థము కాదు. ఒక వైపు కట్టుచూ వచ్చుచుండిన మరొక వైపున కూలుచూ వచ్చుచుండును: వూహామేడలు.

## దేవునిదేహము - దేశక్షేమము

**జీవునకు దేహమెట్లు ప్రధానమో దేవునకు దేశమట్లు ప్రధానము.** దేహమునందలి యే భాగమున యేమి జరిగిననూ జీవునకెట్లు సంబంధమో దేశమున యే భాగమున యేమి ప్రమాదము జరిగిననూ, దేవునకట్లే సంబంధించి యుండును. దేహములోని సర్వాంగములూ యెట్లు క్షేమముగా నుండకోరుదుమో, దేశములో సర్వ ప్రాంతములూ అంత క్షేమముగా నుండవలెననే దేవుని భావము. దేశమంతా దేవుని దేహమయినపుడు, తన అంగముల నాశమును దైవము కోరుకొనుననుట వివేకమా? దైవవిషయమున సర్వులూ సమానులే. దైవమును పొందే విధానమునకు సర్వులకు అధికారమున్నది. కాని యే యే కర్మలు చేసి తమ తమ కర్తవ్యములను జరుపవలెనో ఆయా అవయవములు అట్లుచేయవలెను. అట్లే ఆయా వర్ణములవారు తమ తమ హద్దులను దాటక తమ తమ కర్తవ్యములను సలిపి దేశ క్షేమమునకు పాటుపడవలెను. దేహమునకెట్లు అవస్థాభేదములున్నవో అట్లే దేశమునకు వర్ణములు, అవస్థాభేదములు. అట్లుకాక వ్యాపారము చేయువారే అందరూ వుండిన

కొనువారవరు? అందరూ యుద్ధము చేయువారే వుండిన వారికి తగిన తిండి, తీర్థములు, సరఫరా చేయువారెవరు? అందుకనే ఒకరు ఒక వర్గమును వర్ణమును నియమించుకొని, వారి వారి పనులు వారు చేయుచూ, **తమ తమ కర్మలన్నియూ దేశ రక్షణ నిమిత్తమని భావించుట చాలా ఉత్తమ మార్గము.** చేయవలసిన వెన్నియో ఉండగా అనవసరంగా వర్ణములను అడ్డుపెట్టుకొని మనలో మనము యుద్ధము చేయుచున్నాము. మన మన దేహములనే హద్దులో పెట్టుకొనలేని వారలము, ఇక దేశము నేమి హద్దులో వుంచగలము? వర్ణకలహములు మాని దేశ క్షేమమును యోచించుట మంచిది. ఇంత కాలమూ మన పూర్వీకులు యెట్లు కాపాడుకుంటూ వచ్చారో అటులనే నేడునూ మన వర్ణములను కాపాడుకొనుట దేశమునకే పరమ శ్రేయస్సు.

## పరమాత్మకు పక్షపాతములేదు

**ఈ వర్ణవ్యవస్థలో పరమాత్ముడు యెట్టి పక్షపాతమూ చేయలేదు. అతనిలో అట్టి గుణమేలేదు భగవంతునికి కూడా ఈ భేదమెందుకని కొందరు తలంతురు.** అతనిలో భేదము యేకొసనులేదు. చక్కెర ముద్దవంటి చల్లనివాడు, తియ్యనివాడు దేవుడు. సర్వభేధములూ, బాధలూ, అనాత్మ భావముగల జీవుల కల్పనలేకానీ దేవుని కల్పనలు కావు. ఉదాహరణమున కొకవిషయము యోచింతము: ఒక తల్లికి నలుగురు పిల్లలు గలరు. నలుగురూ ఒకే తల్లి గర్భము నుండి జన్మించినవారే! కాని,తొట్టిలో పరుండబెట్టిన బిడ్డ యోగక్షేమములు చూచినట్లు మిగిలిన పిల్లలను ఆ తల్లి చూడదు. అంతేకాక పిల్ల పిలువక పోయిననూ కాలకాలములకూ తగిన ఆహార సదుపాయములు తల్లియే గమనించుచుండును. మిగిలిన ముగ్గురు బిడ్డలు వచ్చి అడిగిననే అన్నము పెట్టును. ఆటబొమ్మలిచ్చును. అంతమాత్రముచేతనే తల్లి భేదబుద్ధిగలదనికాని, తన ప్రేమంతా కడగొట్టుబిడ్డపై నున్నదనికాని చెప్ప వీలులేదుకదా! బిడ్డలయొక్క శక్తి సామర్ధ్యమునూ, పరిస్థితులనూ పట్టి తల్లి యెట్లు మెలుగునో అటులనే లోకమంతా తనవారైనప్పటికినీ అందరూ తన సంతతే అయినప్పటికినీ ఒక్కొక్కరి శక్తి సామర్ధ్యములను పట్టి ఒక్కొక్క రక్షణ బాధ్యతను దేవుడు నియమించినాడు. అట్టి నిస్స్వార్థమైన, నిర్దోషియైన నిరాడంబరుడైన నిత్యానందునిపై నిందలు మోపుట సూర్యునిలో చీకటిని వెతుకుటవంటిది. తన కిరణములు పడిన వెంటనే చీకటి పటాపంచలయైపోవును. అట్టిది ఇక తనలో చీకటి నిలుచుటకు వీలగునా! ఇది యెంత అజ్ఞానము! ఇట్టివారలను సూర్యుని విషయమే తెలియని వారనవచ్చును.

## వ్యవస్థను మరొక రీతిగా భావించు

**అసలు ఆధ్యాత్మిక దృష్టిలో ఈ వర్ణములను మరొక రీతిగా భావించ వలసియుండును.**

**బ్రహ్మనిష్ఠగలవాడే బ్రాహ్మణుడు. అసత్య పక్షమును ధిక్కరించువాడే క్షత్రియుడు: సదా సద్విచారము చేయజాలెడి వ్యవసాయాత్మిక బుద్ధిగలవాడే వైశ్యుడు: కర్మనిష్ఠా సత్యాచరణను సల్పువాడే శూద్రుడు; మానవత్వము పొందుటకు ఈ నాలుగు వృత్తులు అత్యావశ్యకము.**

## వర్ణాశ్రమధర్మాలు

వర్ణాశ్రమ ధర్మాలు కూడా మానవుని మనస్సును భగవంతునిపై లగ్నం చేయటానికే ఏర్పడ్డాయి. అందులో జీవితంలో ప్రతిస్థాయిలోను ప్రతివారికి జీవన విధానము, సాంఘికమైన హక్కులు, కట్టుబాట్లు, వారికి ప్రవర్తనా నియమావళి ఏర్పరచారు. అవన్నీ చిత్తవృత్తులను నిరోధించి మనోవికాసం ఏర్పడటం కోసం ఉద్దేశింప బడినవే. వర్ణాశ్రమమనేది బాగా వేళ్ళూని ఉన్న వృక్షం వంటిది. దాని క్రింద అన్ని తరగతులవారు విశ్రాంతి పొందవచ్చు.

## స్వధర్మము

శ్లో॥ శ్రేయాన్ స్వధర్మో విగుణః
పరధర్మా త్స్వనుష్ఠితాత్
స్వధర్మే నిధనం శ్రేయః
పరధర్మో భయావహః

కృష్ణుడు స్వధర్మము, పరధర్మము అనే వాటిని బోధిస్తూ వచ్చాడు.పరధర్మమంటే ఏమిటి? ఇంకొకరి ధర్మమా? పరధర్మమంటే ఇతరుల ధర్మము కాదు. అట్లే స్వధర్మమంటే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులకు సంబంధించిన **కుల ధర్మములు కాదు. 'స్వధర్మము' అనగా 'ఆత్మధర్మము.' పరధర్మమనగా దేహ ధర్మము. స్వ అనేది కేవలం ఆత్మకు మాత్రమే సంబంధించినది. "స్వ+ఇచ్ఛ=స్వేచ్ఛ" ఆత్మ నుండి ఆవిర్భవించినదే స్వేచ్ఛ. అదే స్వధర్మము. అదే నివృత్తి; అదే నిశ్చలమైన తత్వము.**

**పరధర్మమనగా దేహధర్మము. స్వధర్మమనగా ఆత్మ ధర్మము** అంతేకాని స్వధర్మమంటే క్షత్రియ ధర్మము. వైశ్య ధర్మము, శూద్రధర్మము, బ్రాహ్మణ ధర్మము యీ కులములకు సంబంధించినది కాదు. స్వధర్మము అనగా ఆత్మధర్మము, ఆత్మధర్మము ఎప్పటికి

భయమును అందించదు. "పరధర్మోభయావహః" ఈ దేహ ధర్మము అనుసరించినప్పుడే మనకు భయము ఆవిర్భవిస్తుంది.

## జగత్ క్షేమము

మనుశాస్త్రం - నీవు మానవుడై ఈ జగత్తులో జన్మించినందుకు కులమునకై నీ జీవితాన్ని పోషించుకో, త్యాగముచేయుము, సమాజమునకై కులమును త్యాగము చేయుము. **సమాజమే ప్రధానమైన సూత్రమని ప్రబోధించినది. ఉపనిషత్తులు - "సహస్రశీర్ షాపురుషః సహస్రాక్ష స్సహస్రపాత్" అన్ని శిరస్సులు దైవంయొక్క శిరస్సులే, అన్ని హస్తములు దైవముయొక్క హస్తములే అన్ని పాదములు దైవము యొక్క పాదములే - అని ఐకమత్యమును, సమాజతత్త్వాన్ని ప్రబోధిస్తూ వచ్చాయి.** మానవునిది సమిష్టి సాంప్రదాయమేకాని, వ్యష్టి సాంప్రదాయము కాదు. ఈ జగత్తులో మానవుడు వ్యష్టిగా జీవించలేడు. మానవుడు ఈ జగత్తునందు సుఖ శాంతులతో జీవించవలెనన్న సమిష్టిభావాన్ని పోషించు కోవాలి. అన్ని మతములు సమాజ క్షేమాన్ని, శ్రేయస్సును దృష్టి యందుపెట్టుకొని ప్రబోధలు సలుపుతూ వచ్చాయి. ఈ సమాజము యొక్క క్షేమమే జగత్ క్షేమము.

## కులము/కులములు

ఒకే దైవమునకు అనేక నామములు, రూపములుండ వచ్చును. కాని దైవత్వము మాత్రము ఒక్కటే. అన్ని మతముల వారు భారతదేశము నందున్నారు, అనేక కులముల వారు వున్నారు. **కులము అంటే ఏమిటి?** ఒక చిన్నవిషయం మీరు గుర్తించాలి. ఈనాడు రెడ్లనీ, కాపులనీ, కమ్మవారనీ, బ్రాహ్మణులని చెప్పుతుంటాం. ఈ భేదములు ఎట్లు ఏర్పడినవి?

పురుష సూక్తము 13వ మంత్రము ఇలా వివరించింది.

పరమ పురుషుని నుండి యుద్భవించిన వర్ణధర్మములే నాలుగు వర్ణములు. (four classes in Society not castes). ఇవి నేడు కులములు జాతులు అనబడు విభాగములు కాదు. పురుషసూక్త మంత్రమునుబట్టి భారతదేశమందు వర్ణములున్నవి కాని కులములు లేవు. ఒకొక్కని గుణము చేతను కర్మముచేతను వాని వర్ణ విభాగము పుట్టుకు తోడనే జరుగుతుంది. ఇది వ్యక్తుల పూర్వజన్మ సంస్కార జనితమగు నైజస్థితి అనుసరించి కలుగుతుంది.

**బ్రాహ్మణోఽస్య ముఖమాసీత్ । బాహూ రాజన్యః కృతః**
**ఊరూ తదస్య యద్వైశ్యః పాద్భ్యాగ్ం శూద్రో అజాయత॥**

ముఖం అనేది బ్రాహ్మణులు, భుజం అనేది క్షత్రియులు, ఊరువు(తొడలు) అనేది వైశ్యులు, పాదం అనేది శూద్రులు, అని దీని అర్థము. అంతేకానీ బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య శూద్రులనేవి తెగలు కావు. అయితే యిందులో ఏది ప్రధానం? ఏది ఆధారము అంటే మానవ దేహమునకు కాళ్ళు ప్రధానం. కాళ్ళు లేకుండా తొడలుండులకు వీలుకాదు, తొడలు లేకుండా భుజములు, భుజములు లేకుండ తల ఉండుటకు వీలులేదు.

ఇందులో తల చేయవలసిన పని ఏమిటి? తల లోపల పంచభూతము లుంటున్నాయి. అంటే తల చాలా ప్రధానమైనది. (శబ్ద స్పర్శ, రూప, రస, గంధ) చూచే నేత్రములు, వినే చెవులు, వాసన చూసే ముక్కు, రుచిచేసే నోరు, యివన్నీ ముఖమునందే వుంటున్నాయి. కనుక యీ బ్రాహ్మణత్వమనే ముఖానికి చాలా (Responsibility) జవాబుదారి అంటే బాధ్యత ఉంటుంది. ఈ ముఖమనే బ్రాహ్మణత్వం ఏం చేస్తున్నది? పంచ భూతములతో పంచేంద్రియములకు తగిన క్రియలను అందిస్తుంది. ఇట్టి ప్రధాన బాధ్యత కలిగిన ముఖాన్ని రక్షించే నిమిత్తమేర్పడినవి భుజములు. భుజబలము చేత జీవితాన్ని పోషించే నిమిత్తమై ఏర్పడనవి తొడలు. ఈ రెండింటిని ఆధారం చేసుకుని అక్కడివి యిక్కడ - యిక్కడవి అక్కడ అనేక రకములుగా ప్రోగు చేసుకొని యీ దేహమును పోషించేవి పాదములు. దీనివలననే చెప్పారు.

**శాస్త్రంబు నెప్పుడు సత్యంబుగా నెంచు**
**వేదసమ్మతంబగు విప్రులారా!**
**దేశంబు కొరకునై దేహమర్పణచేసి**
**రక్షించే రాజాధి రాజులారా!**

**వ్యవసాయ వృద్ధిచే వర్ధిల్లు చుండెడి సుఖజీవనము చేయు శూద్రులారా!**
**ధన ధాన్యములు కలిగి ధర్మగుణంబుచే వరలు చుండెడి ఆర్యవైశ్యులారా!**

మనము చేయవలసిన కర్తవ్యము లనేకము లుండినపుడు, మనము ఏ విధమైన అపోహలకు గురికాకూడదు. **బ్రాహ్మణ, క్షత్రియ వైశ్య శూద్రత్వ మన్నవి ఒక్క దేహంలోని అంగాలే.** ఈ అంగములలో ఏ ఒక్కటైనా పని చేయకపోతే మరొకటి చేయదు. కనుక దేహంలో వున్న అంగములు వేరైనప్పటికినీ అన్నీ కలిసి పని చేయాలి. ఒకచిన్న ఉదాహరణ:

గుండెల్లో, ముఖములో, భుజములో, పాదములలో ప్రవహించేది ఒక రక్తమే. కాని బ్రాహ్మణుడనే ముఖానికి ఒక గుండెలేదు. వైశ్యుడనే తొడల లోపల ఒక గుండె లేదు. క్షత్రియుడనే భుజములలో ఒక గుండె లేదు. ఈ నాలుగు అంగములు ఒకే గుండెపై ఆధారపడి వున్నవి. **కనుక గుడిలేని గ్రామము, గుండెలేని దేహము ప్రయోజనము లేనట్టివే.**

## సత్యాన్ని, సమత్వాన్ని బోధించాలి

**స్వరూపములు వేరైనా సర్వులలో ఐకమత్యమును, అన్యోన్యత్వమును, సమత్వమును నిరూపించే నిమిత్తమై దేశరక్షణ నిమిత్తమై ఆనాడు యివన్నీ యేర్పడినవి.** కొంతమంది వాదిస్తూంటారు. ఒక్క మన భారతదేశములోనే ఈ బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనే కులాలున్నాయి అని. ఇది చాలా పొరపాటు. మిగతా దేశములలో లేవనుకోరాదు. ఈనాడు భారత దేశములో బ్రాహ్మణులనే వారిని పాశ్చాత్యదేశాలలో ఫాదర్స్ (Fathers) అంటుంటారు. మనం క్షత్రియులం అంటుంటే వారు సైన్యం (Army) అంటున్నారు. మనం వైశ్యులంటే వారు Business men అని పిలుస్తున్నారు. శూద్రులను (Labour) కార్మిక వర్గమని పిలుస్తున్నారు. ఈ నాలుగు భాగములు సర్వదేశములందు ఉంటున్నాయి. అయితే ఈ నాలుగు భాగాలు ఆత్మపరిశీలన నిమిత్తమై దేశ సౌభాగ్య నిమిత్తమై మానవత్వమును కాపాడే నిమిత్తమై ఏర్పడినవి. యీ విధమైన తెగలుగా భావించుకొనుట చాలా పొరపాటు. ఇది మన అజ్ఞానము. **శూద్రత్వ మనగా నేమిటి? శ్రమించి పనిచేసేవారు అని అర్థము.** అంతే గానీ ప్రత్యేకమయిన తెగగా భావించరాదు. ఇటువంటి ధర్మస్వరూపాన్ని నిరూపించేది భారతీయ సంస్కృతి. కనుక మనము పిల్లలకు **"నాయనా! దైవత్వము ఒకటే దివ్యత్వము ఒక్కటే. దేశములు భిన్నములు, ఆచారములు భిన్నములు, మతములు భిన్నములు, మార్గంబులు భిన్నములు. కానీ గమ్యము మాత్రము ఒక్కటే".** ఈ సత్యాన్ని సమత్వాన్ని మనం పిల్లలకు బోధించాలి. / (శ్రీ.స.ది. పే 46/49. శ్రీ సత్యసాయి ప్రబోధామృతం (P 215/218)

## బ్రాహ్మణుడు

బ్రాహ్మణులు ద్వేష బుద్ధితో మిగిలిన **కులములవారిని వేదములు చదవనీయకుండా చేశారని కొందరు భావిస్తున్నారు.** అది సరికాదు. మీరు ఒక చేపను పట్టుకొనటానికి వెళ్ళేటప్పుడుఒక పొడుగాటి ఇనుపచువ్వ, దానికొక కొక్కెము, ఆ చేపను ఆకర్షించే ఆహారము ఇవన్నీ కూడా తీసికొని వెళ్ళాలి. **మీరు వేదములను వశం చేసుకోవాలంటే మీకు ధార్మిక జీవనం అనే ఇనుపచువ్వ ఉండాలి, వైదిక సంస్కృతం అనే కొక్కెము ఉండాలి. వేదములచేత**

**గౌరవింపబడే బ్రాహ్మణుడు తిరిగి ఆ వేదములను గౌరవిస్తాడు.** అటువంటి ఆకర్షణీయమైన ఆహారం కూడా ఉండాలి. బ్రాహ్మణుడు తనను తాను పరిశుద్ధమొనర్చుకొనే అనేక ఆచారాలు, సంస్కారాలు పాటించటానికి సిద్ధంగా ఉంటాడు. ఇది అతడు మంత్రాలను ఉచ్చరించటానికి, ఎదుటివారికి చెప్పటానికి అర్హత కలిగిస్తుంది.

**ప్రతివారికి ఉదాత్తమైన భావాలు ఉండవు.** మీరందరూ నామాటలు వింటున్నారు కదా! మీకందరికి నేను చెప్పినవి చెప్పినట్లు అర్థమవుతున్నాయా? లేక నేను చెప్పినవి చెప్పినట్లు మీరేమైనా ఆచరిస్తున్నారా? లేదు. ప్రతివారు వారి వారి స్వభావములను బట్టి, వారి మానసిక ప్రవృత్తిని బట్టి అర్థం చేసికొనటం కాని, ఆచరించటం కాని ఉంటుంది. మానవులందరూ ఒకే విధంగా ఉండరు. **ఒకవ్యక్తి మరొక వ్యక్తి వలె ఉండడు. మానవులంతా యాత్రికుల బృందమే.**

**బ్రాహ్మణుడు పుట్టుకతో శూద్రుడే.** బ్రాహ్మణకులములో పుట్టినంత మాత్రముచేత అతడు వేదపండితుని కుమారుడైనప్పటికీ వేదపఠనకు అర్హుడు కాడు. అతనికి సంప్రదాయానుసారంగా శాస్త్రోక్తంగా ఉపనయనం జరిగిన తరువాతనే అతడు బ్రాహ్మణుడు అవుతాడు. అతడు అప్పుడు అధ్యయన ప్రపంచంలో తిరిగి జన్మించినట్లు.

శాస్త్రమునే సత్యముగా విశ్వసించి, దానిని అనుసరించి, ఆచరణకు జీవితమును అంకితం చేసినవాడు బ్రాహ్మణుడు. అతడెవరైనా కావచ్చు. జన్మ బ్రాహ్మణుడే కానక్కరలేదు. ఈ కర్మ బ్రాహ్మణ్యాన్నే మనము ఆదర్శంగా తీసుకోవాలి. అదే గుణకర్మ విభాగం. ఋక్కులను వేరు చేసి ఋగ్వేదమని, యజుస్సులను వేరుచేసి యజుర్వేదమని, సామములను వేరుచేసి సామవేదమని ఏ విధంగా విభాగం చేసినారో అదే విధంగా సత్వరజస్తమోగుణాల్ని పురస్కరించుకొని, ఆయా తెగలను ఏర్పరచినారు.

చాలామంది బ్రాహ్మణులు ఆస్తికతతో కూడిన నిరాడంబరత్వాన్ని, పాండిత్యస్థాయిని కోల్పోతున్నారు. స్వచ్ఛమైన లోహము కలుషితమైనప్పుడు దానిని మరల మూసలో పోయాలి. ఇటువంటి స్వచ్ఛమైన పాత్రల వంటి వేదపండితులు కనిపించినప్పుడు మనం వారిని రక్షించాలి. కొందరు ద్వేషపూరితమైన తెలివిమాలినవారు రాళ్ళు విసిరితే ఈ పాత్రలు పగిలిపోతాయి. వేదములు కూడా దూరమైపోతాయి.

**బ్రాహ్మణులు వేద సంరక్షకులు కాబట్టి బ్రాహ్మణుల్ని అడవిలోకి తరిమివేస్తే, వేదాలు కూడా అడవిలోకి వెళ్ళిపోతాయి.** వేదములను స్పష్టంగా ఉచ్చరిస్తూ, అద్భుతమైన జ్ఞాపకశక్తితో వాటిని ఎన్నో యుగాలనుంచి కాపాడుతూ, భారతదేశం ఎన్ని ఉత్పాతాలు ఎదుర్కొన్నప్పటికి

వాటిని నిలిపి ఉంచినవారు బ్రాహ్మణులు. ఒక బాలుడు ఇంటి దగ్గర ఇంగ్లీషు పాఠం చదువుతున్నాడు. అతడు చదివే విధానం తల్లిదండ్రులకు ఎంతో ఆందోళను కలిగించింది. "మిల్క్" అనే పదాన్ని ఎమ్,ఐ,ఎల్,కె మిల్క్; ఎమ్,ఐ,ఎల్,కె మిల్క్ అని వేగంగా చదువసాగాడు. తల్లిదండ్రులు అది విని అమ్మా ఎలుక, అమ్మా ఎలుక అని భయపడిపోతూ పిలుస్తున్నాడని భావించారు. ఉచ్ఛారణ స్పష్టంగా ఉండాలి. బ్రాహ్మణులు వేదం చక్కగా చదవటానికి వారిని ప్రోత్సహించండి. వారి వేదపఠనం వల్ల మీకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

**కలహములకు, కల్లోలములకు కులమతములు కారణములు కావు. కేవలం స్వార్థపరుల యొక్క అహంకారము, అసూయాభావము ఆధారం చేసుకొని, మతమనే బురఖావేసుకొని, ఆడే ఆటలేతప్ప, కుల మతములు కలహానికి కారణము కావనే సత్యాన్ని గుర్తించటము అత్యవసరము.** కనుక ఇట్టి దుర్భావమును ఆధారంచేసుకొని, కులమతములనే నాశనము చేయు ప్రయత్నమునకు పూనుకోవడం జరుగుతుండాదీ. **ఈనాడు మనము చేయవలసినది. కులమత ద్వేషములను నాశనము చేయడమే కానీ కుల మతముల నాశనం చేయుటకు పూనుకోకూడదు. అందరిదీ ఒక్కకులమే, అదే మానవకులము Religion of love, అదే మన మతము యొక్క సరియైన ఆధారము.** అంతేకాని మనము మరియొక మతమును ఆశ్రయించాలని, లేక ఇతరులను మన మతములో చేర్చుకోవాలని, ఇలాంటి దుర్భావములకు ఏ మాత్రము స్థానమివ్వకూడదు. ఏ మతమునందైననూ ఉండండి. ఏ తెగయందైననూ ఉండండి **అన్నింటియొక్క అంతరార్థము, అన్నింటియొక్క ప్రధాన సారము ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించటం అత్యవసరము.**

## మహోన్నత స్థితికి గుణమే కారణము - కులం కాదు

వ్యాసమహర్షి జాలరి కులమున పుట్టెను. వసిష్ట మహాఋషి వేశ్యయగు ఊర్వశికి జన్మించెను. శౌనక మహాముని శునక వంశమున పుట్టెను. అగస్త్యుడు ఘటమున జన్మించెను. విశ్వామిత్రుడు క్షత్రియ కులమున పుట్టెను. ఖగోళమహాముని వైశ్యవంశమున జన్మించెను. సూతమహాముని చతుర్థ వంశమున (శూద్ర) జన్మించెను. ఇక సహజులుగా జన్మించి, సద్గుణములతో జాతి ధర్మమును దేహ ధర్మములను కొంతకాలము పాటించి సత్యమును యెరింగి తదుపరి సర్వమునూ దూరీకరించి సర్వదాముక్తిని స్వవశము చేసుకొన్న విదురుడు, సంజయుడు, సత్యకాముడు మొదలగు వారలు కూడా అనేక మంది వున్నారు. నాయనా! **పురుష ప్రయత్నము, వివేకము, తపస్సు వీనివలన కలుగు గుణములే మహోన్నత స్థితికి**

**కారణములు. మానవ జాతికి ఆత్మశుద్ధిలేకయే జాతియందు జన్మించిననూ ముక్తిని పొందలేరు.** మలినమైన రాగిలో కూడిన బంగారము వెల తగ్గినదగుచున్నది. అలాగుననే తాను శుద్ధ విరాడ్రూపుడయినను, సంసార సంసర్గములచే అహంకారముతో కూడిన జీవుడగును. జీవుడును తపోవ్రత సంస్కృతుడై శుద్ధబుద్ధియుతుడై నిజస్థానమగు పరమాత్మ స్వరూపమును పొందును. కాలని కుండ జలస్పర్శముచే కరిగి మట్టియగునటుల తపస్సుచే పరిపక్వముకాని వారి మనసు విషయ దోషముల సంబంధముచే విషయములో ప్రవేశించుచున్నది. **తపోగ్నిచే దహించబడిన కుండను సముద్రమున పడవేసిననూ కరుగక వుండును. తీవ్ర తపోవహ్నిచే నిశ్శేషముగా దహింపబడిన కర్మ బీజములు కలవారు గనుకనే జ్ఞానసంపత్తి గలవారై, నిర్మల తత్త్వముచే ముక్తులై జనన మరణముల జెందనివారగుచున్నారు.**

## పంచభూతాలది ఏ కులం?

ప్రపంచానికి ప్రధానమైనవి ఐదు ఉన్నాయి. అవియే పంచభూతాలు.**గాలిది ఏకులం? నిప్పుది ఏకులం? నీటిది ఏ కులం? భూమిది ఏ కులం? ఒక మానవునికే వచ్చిందా ఈ కులతత్వం?**

**కులమత ద్వేషాలు పోవాలి. యూనిటి లేక పోవుట చేత, డివినిటి (divinity) కూడాఉండదు.**

(Unity, Purity, Divinity) యూనిటి, ప్యూరిటి, డివినిటి. ఈ మూడూ విడిచి కమ్యూనిటీని పట్టుకుంటావా? అది నిన్ను రక్షిస్తుందా? దేశాన్ని కాపాడుతుందా?

అందరిలోఉన్నది ఒక్కటే ఆత్మతత్వము అని గుర్తించాలి.

**జాతిమత కులబేధాలు పాటించకూడదు. మానవులందరిదీ ఒక్కటే జాతి - మానవజాతి.**

## కులమతద్వేషములు

"కులమత **ద్వేషాలు** కూలద్రోయుడటంచు
చేయెత్తి బోధనల్ చేయవలయు
దీనుల సేవయే దివ్యమార్గమటంచు
పలుమారు గట్టిగా పలుక వలయు
నామ చింతన చేయు నరుని నామి సన్నిధి చేర్చి
అమృతత్త్వము నందించు నని నెరుగవలయు
భక్తి విశ్వాసములు బాగుగా కలిగిన వారలు

మనవారలని వచించవలయు
జ్ఞాన బోధలు నరులకు చేయువారు
ఇష్టులవుదురు ఎంతైన స్పష్టముగను
భేద భావంబు విడనాడి ప్రీతి తోడ
**కలసి యుండుటయే మీరంత**
**సాయికి కలుగు ప్రేమ**
ఇంతకన్న వేరెద్ది ఎఱుక పరతు
సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులారా". / (శ్రీ సత్యసాయి ప్రేమవాహిని పు. 41

## దేశసమైక్యతకు ఐకమత్యము

చీమల్లో కాకుల్లో ఉన్న ఐకమత్యం మానవుల్లో లేదు. ఒకే తల్లి గర్భాన్ని పుట్టిన బిడ్డల్లోకూడా యిట్టి ఐకమత్యం కనబడదు. ఐకమత్యము లేకపోవుట చేత పూర్వం స్వాతంత్ర్యాన్ని కోల్పోయాము. అనేక కష్టనష్టాలకు గురి అయ్యాము. ఐకమత్యమే మహాబలమని తెలియదా?

మాపైన ఎవరైనా పరరాజు. దండెత్తి వచ్చినప్పుడు మేమంతా 105 మంది అన్నదమ్ములము. కాని, మాలో మాకే ఏమైనా అభిప్రాయ భేధాలు కలిగితే మేము 5 మంది మాత్రమే అన్నాడు ధర్మరాజు. ఇదెంతటి ధర్మమో చూడండి!

మన దేశం పైకి ఎవరైనా దండెత్తి వస్తే అన్ని పార్టీలు వారు ఏకం కావాలి. **"నాపార్టీ, నీపార్టీ" అంటు దేశాన్ని ముక్కలు ముక్కలుగా చేయకూడదు.**

**కాని దేశంపైకి ఎవరైనా వస్తే, అందరూ కలిసి దేశం కోసం ప్రాణాలు విడవవలసిందే! దేశాన్ని రక్షించవలసిందే.**

**ఇదే నిజమైన స్వాతంత్ర్యము. ఇదే నిజమైన ఐకమత్యము.** ఇది లేకుండా "నీది-నాది" అని పోట్లాడుతూ కూర్చుంటే ఇంక దేశం ఏ విధముగా అభివృద్ధి చెందుతుంది?

ప్రేమ స్వరూపులైన భక్తులారా...! **ప్రతీ ఒక్కరు ఐకమత్యమును ప్రేమను పెంచుకొని, దేశక్షేమాన్ని, యావద్విశ్వ క్షేమాన్ని కోరాలి. ఇదియే నిజమైన భారతీయ సంస్కృతి.**

**"లోకా స్సమస్తా స్సుఖినో భవంతు"** "నా భారతదేశం మాత్రమే బాగుండాలి అని అనుకోకూడదు" అన్ని దేశాలు బాగుండాలి అని అనుకోవాలి. ప్రపంచములోని 575 కోట్ల మంది ప్రజలందరూ భగవంతుని బిడ్డలే! ఈ దేశము, ఆ దేశము అని భేధాలు పెట్టుకోకూడదు.

ఐకమత్యమే బల మందరి క్షేమంబు
ఎంత కార్యమైన నెగ్గవచ్చు
చిన్న చీమలన్ని సర్పంబునున్ బట్టి
చంపుచుండ లేదె జగతియందు!

"దేశం సమైక్యంగా ఉండాలి. విచ్ఛిన్నం చేయకూడదు. మానవ దేహంలో కాలు, చెయ్యి మున్నగు అనేక అంగాలు ఉన్నాయి.దీనిని ముక్కలుముక్కలు చేస్తే ఎంత రక్తం పోతుంది! ఎంత బలహీనత ఏర్పడుతుంది! యోచించండి. దేహమెంతో దేశమూ అంతే. హక్కులను అడుగవచ్చు. అందులో దోషం లేదు. కాని, వేర్పాటువాదం మంచిది కాదు. దారాలు విడిగా ఉంటే చిటికెన వ్రేలుతో సులభంగా కట్ చేయవచ్చు. కాని, దారాలతో నేసిన బట్ట దృఢంగా ఉంటుంది. ఐకమత్యమే మహాబలం. కనుక, అందరూ సమైక్యంగా జీవించాలి."

బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రాదులు
ఏక గర్భ జాతులటంచు కాంచరయ్య
అన్నలు ద్విజులు శూద్రాదులు తమ్ములు
బలు ప్రేమ చూపుటే భావ్యమయ్యా
గుణముచే క్రియలచే తనరు వర్ణము లెల్ల
గుణమున్న గ్రహియింప కూడునయ్యా
ద్విజుడు దుర్గుణుడైన కనగ శూద్రుడు కాదె
సుగుణి శూద్రుండు భూసురుండు కాడే
తనయులకు పితరులకు భేదంబు కలదే
**ఐకమత్యంబు అన్నింట అభివృద్ధి పరచి**
**కలత విడనాడి ఐక్యంబు కాంచరయ్యా**
**అపుడే ఈ దేశ మభివృద్ధి నొందునయ్య.**

ॐ

# మతసామరస్యము

## సనాతన ధర్మము

**సనాతన ధర్మము అతి ప్రాచీనమైనది. ఇది ఆచరణ యోగ్యమై అభీష్టము ననుసరించి దివ్యానుభవము నందించునట్టిది.**

లోకమున సర్వ మతములకు,సర్వ సాంప్రదాయములకు, సర్వ ధర్మములకు సనాతన ధర్మమే తల్లి. అట్టి తల్లి పుట్టినిల్లే ఈ భారతదేశము. ఆహా! భారతీయులెంతటి భాగ్యశాలురో ఈ భారతదేశమెంత భవ్యమైనదో: యోచింపుడు.

లోకమంతయు లోకేశుని దేహముగా ఉన్నను, ఆ దేహమున ప్రత్యేక సూత్రమయిన నేత్రములవంటిది, ఈ భారతదేశము నేత్ర హీనమయిన దేహము పరాధీనమే కదా? భారతదేశము వేదశాస్త్రములను నేత్రములతో అలంకరింపబడినది. అందుమూలముననే భారతీయులు పొందినంత సంస్కారమును మరేదేశీయులు పొందలేరని చెప్పుటలో సందియము లేదు. **సర్వ మత సత్యత్వమును, సహనమును బోధించిన సనాతన ధర్మమే** సర్వుల ధర్మము. వివిధ ప్రదేశములలో పుట్టి వివిధ మార్గములుగా ప్రవహించి, కడకు నదులు సముద్రమున ఎట్లు చేరుచున్నవో, అటులనే వివిధ ప్రదేశములలో ఉద్భవించి, వివిధ ధర్మమార్గముల ప్రవర్తించి, వివిధారాధనలతో సర్వేశ్వరుని సన్నిధి అను సాగరమును చేరుచున్నారు. **నానాదిశలకు ప్రాకునట్టి ఈ భిన్న మార్గములన్నియు కలియునట్టి కేంద్రస్థానమే సనాతన ధర్మము.** సర్వమతములవారు సత్యవాక్పరులుగా ఉండుట, ఈర్ష్యా కోపారహితులై యుండుట. ప్రేమహృదయులై ప్రవర్తించుట, ఇట్టి సనాతన ధర్మము అనుష్ఠించవలెను. వీటిని **పట్టువిడక సాధించువాడే భారతీయుడు.**_ఆదికాలము నుండియు నేటివరకు అగ్రస్థానమును వహించి, శాశ్వతముగా నిలిచియుండునది ఒక్కహిందూ మతము మాత్రమే. నాటి చారిత్రక యుగములనుండియు నాశమెరుంగని వారు ఒక్క భారతీయులే. ప్రేమ, సమంజసము, కృతజ్ఞతా సహితమగు జీవితమును ఈ మతమునందు గడిపినటుల మరేమతము నందును గడుపలేదు. తత్వావిష్కరణమూలమున, వేదమూలమున హిందువులు వారి ధర్మమును పొందియున్నారు. అది అంత్యములులేని వేదశాస్త్రముల సారమును గ్రోలినవారు ఈ భారతీయులు. ఇట్టి పవిత్ర భారతదేశము లోకమునకు ఆధ్యాత్మిక గనివంటిది. ఈ బ్రహ్మాండమైన భూగర్భమున ఒక్కొక్క ప్రదేశమందు ఒక్కొక్క లోహము

కనుపించినట్లే **ఈ భారతదేశమందు సర్వశాస్త్రవేద ఉపనిషత్ తత్త్వములసారమైన సనాతన ధర్మము ఉత్పత్తి అయినది.** భారతీయుల భాగ్యమా అన్నట్లు వారి పుట్టినిల్లుగా ఉన్న **ఈ సనాతన ధర్మపు గనులు ఎచ్చట ప్రారంభమవునో అచ్చటనే అందునిమిత్తమైన నాయకులు, విచారకులు, విమర్శకులు, ప్రచారకులు, ప్రబోధకులు ఉద్భవింతురు.** అట్టి మతమునకు చెందిన వారగు మహా పురుషులు, నిష్కామ కర్మయోగులు. పండితోత్తములు, ప్రజ్ఞా వంతులు, ఋషులు, దైవాంశ సంభూతులు, యజ్ఞ పురుషులు ఈ భారతదేశమందే అనేకులు ఉద్భవించిరి. వీరల ఆధారముల వలననే ఇట్టి అనుభవసిద్ధమైన ఆధ్యాత్మికసారము దేశమంతయు ప్రవహించినది. ఈరీతిగా లోకమంతయు సనాతన ధర్మము సారవంతమై అభివృద్ధిచెంది నది. ఎన్ని దేశముల ప్రవహించినను, **ఆదిస్థానము భారతదేశమే.**

## సనాతన మతము

అసలు ఉపనిషత్తులనుండే భూగోళిక; జ్యోతిష; అర్థ శాస్త్రములునూ; స్కంద; శివ, గరుడ మున్నగు 18 పురాణములునూ తాంత్రిక మాంత్రిక, భక్తి, జ్ఞాన, కర్మయోగములునూ మహా ఋషులచే లోకమునకు అందింపబడినవి. వేదోపనిషత్తులే సనాతన మతములు.

**ఇందులో ఒక విచిత్రము, ఇతర మతములవలే మన భారతదేశమున మతస్థాపకులు కనుపించరు. ఆ కనుపించని మతగురువే; స్థాపకుడే; జ్ఞానస్వరూపుడగు ఈశ్వరుడు. అతడే మన ప్రవక్త; అతని అనుగ్రహమును పొంది అతని అంశలో ఐక్యమైన మహాఋషులే మత ప్రవక్తలు.కాని మానవనైతిక ధర్మములు క్షీణించుటచేతనే, మన భారతదేశమున పెక్కుచోట్ల ఈశ్వరుడు మానవ రూపమున ప్రవక్తగా నుద్భవించుచున్నాడు. ఈ సత్యజ్ఞానమును మానవుడు ఉపనిషత్తులద్వారానే తెలిసికొన సాధ్యమగును.**

## భారతీయ సంస్కృతి

భారతీయ సంస్కృతి కేవలం మాటలచే నిర్మాణమైనది కాక కాలముచే మారక, ప్రళయముచే తరుగక, సృష్టిచే పెరుగక ఏ సత్యమైతే ఉన్నదో ఆ సత్యాన్నికి దివ్య స్వరూపము. ఇది దివ్యమైన, నిత్యమైన (మార్పులేని) ధర్మం. ఇలాంటి సత్యధర్మాల్ని విశ్వసించి, నా మతము, నీ మతము అని మతులు పాడు చేసుకోకూడదు. మతిని చక్కదిద్దుకోడానికి తగిన కృషిచేయాలి. ఒకే గ్రామానికి వేర్వేరు మార్గములున్నట్లు అన్ని మతములు ఒకే గమ్యానికి వేరు వేరు మార్గములు. సక్రమమైన మార్గాన్ని అనుసరించి సత్యమైన ఆచరణలోకి దిగి నిత్యానందాన్ని పొందడానికి ప్రయత్నించాలి. నిర్మల, నిశ్చల,

నిస్వార్థ పరుడైన భగవంతుడు మన హృదయాలలో కూర్చోవాలంటే మన హృదయం పరిశుద్ధమైనదిగా ఉండాలి. అప్పుడే భగవంతుని మన హృదయంలో ప్రతిష్ఠించుకోగలం. కాలకర్మకారణాలను పవిత్రం గావించాలి. కుల మత భేదాల్ని దూరం పెట్టాలి. దైవాభిమానం, దైవాసక్తి పోషించుకోవాలి. విరక్తిమార్గంలో ప్రవేశించాలి. భగవంతుడు త్రిగుణాతీతుడు కనుక మనంకూడా త్రిగుణాతీతమార్గంలోనే పయనించాలి. భగవంతుడు సత్య, ధర్మ, ప్రేమ స్వరూపుడు. కనుక, మనం కూడా సత్య ధర్మప్రేమల ద్వారానే భగవంతుని అనుభవించాలి. క్రమేణా సర్వసంగ పరిత్యాగులుగా మారాలి.

## త్రిమత స్థాపకులు

శంకరుల తరువాత వచ్చిన **రామానుజులవారు అద్వైతమును ఖండించలేదు కాని, దానిని కొద్దిగా సవరించి దానికి, "విశిష్టాద్వైతము" అని పేరు పెట్టాడు. అద్వైతమును చెఱకు రసముతోను, విశిష్టాద్వైతమును చక్కెరతోను పోల్చవచ్చును. మూడవది ద్వైతము. దీనిని మధ్వాచార్యుల వారు ప్రతిపాదించారు. దివ్యత్వము చక్కెరవంటిదైతే తాను ఆ చక్కెరను తినే చీమగా పుట్టాలని ఆకాంక్షించాడు. "నేనే చక్కెరనైతే నాకు కలిగే ఆనందమేమిటి? కనుక నేను చక్కెర కాకూడదు, చక్కెరను తినేవానిగా ఉండాలి" అన్నాడు. మానవుడు తనను తాను దైవానికి అర్పితం చేసుకోకుండా ఎన్ని సాధనలు చేసినా, ఎన్ని గ్రంథములు చదివినా ఈ 'చక్కెర' ను తినే అధికారము రాదు. ఇదిగో అమ్మ ఉప్పు అంటే పట్టమ్మ పప్పు అన్నట్లుగా, "ఓ భగవంతుడా! ఇదిగో నా హృదయమును నీకు అర్పిస్తున్నాను" అన్నప్పుడు భగవంతుడు. "నాయనా! ఇదిగో నీకు 'చక్కెర' ను అందిస్తున్నాను" అంటాడు. "యద్భావం తద్భవతి". భగవంతుడు ఎన్నటికీ మారడు. కాని మన భావములు మారితే భగవంతునిలో మార్పు కనిపిస్తుంది.** కనుక మొట్టమొదట మన భావములను చక్కగా స్థిరంగా పెట్టుకోవాలి.

## అద్వైత ద్వైత విశిష్టాద్వైతములు

**అద్వైత వేదాంతమొక్కటే సరియైన వేదాంతమని అనేకులు భారత దేశమున భావింతురు. ఇది సరికాదు. మత సిద్ధాంతముల నవగాహన పరచుకొన జూచువారి కందరకును ప్రస్థానత్రయములనబడు శ్రుతులు, బ్రహ్మసూత్రము, భగవద్గీత ఈ మూడును ముఖ్యమేఅను సత్యమును మరువరాదు. ఈశ్వరవాణి అయిన శ్రుతులు, ఉపనిషత్తులు, రెండవ దైన బ్రహ్మసూత్రములు** వ్యాసునిచే ప్రతిపాదించబడిన తత్త్వ సిద్ధాంతములన్నిటి యొక్క పరమ స్వరూపము. ఇది తత్త్వ వాఙ్మయమునందు అత్యంత ప్రాముఖ్యము గలిగినది. **ఆ అపూర్వ**

**సిద్ధాంతములు పరస్పరవిరుద్ధములు కావు. అందు ప్రతిదీ పూర్వ సిద్ధాంతములపై ఆధారపడియున్నది.** వ్యాస సూత్రములలో వాటికి పరిపూర్ణస్వరూపము సిద్ధించినది. నడుమ వేదాంతమునకు ఈశ్వర నిర్మిత వ్యాఖ్యానరూపమగు భగవద్గీత యిమిడియున్నది. ఆస్తిక మతములని చెప్పుకొను హైందవ మతములన్నియూ ద్వైతము కానీ, విశిష్టాద్వైతము కానీ, అద్వైతము కానీ, ఉపనిషత్తులను, వ్యాససూత్రములను, భగవద్గీతనూ ప్రమాణములుగా అంగీకరించుచున్నవి. వాటన్నిటికీ ప్రస్థానత్రయమే ఆధారము. నూతన సిద్ధాంతమును ఒకదానిని ప్రతిపాదింప సంకల్పించినవారందరునూ అనగా శంకర, రామానుజ, మధ్వాచార్య, వల్లభాచార్య, చైతన్య ఇత్యాది వారందరునూ ఈ ప్రస్థాన త్రయమునకు ఇంకొక భాష్యమును రచించవలసివచ్చెను. కావున ఉపనిషత్తుల ఆధారముపై నిర్మింపబడిన ఒక్క సిద్ధాంతమునకు మాత్రమే వేదాంత శబ్దము వర్తించునని చెప్పుట కేవలము పొరబాటు. అన్నియూ వేదాంత మతములే. వేదాంత నామమును వహించుటకు అద్వైతి కెంత అధికారము కలదో అంత అధికారము విశిష్టాద్వైతికి కూడా కలదు. అంతేకాదు ద్వైతికి కూడా కలదు. ఇదియే పవిత్ర అపురూప అంతరార్థముతో కూడినది. **యేకాత్మ భావన నిరూపించునది భారతీయ పరమార్థ వాహిని.**

ఆవు శరీరమునందు పాలున్నాయి. ఆ పాలలో నెయ్యి ఉన్నది. అయినా ఆ నెయ్యితో బలమురాదు. ఆ పాలను ఆవునుండి వేరుచేసి, అనగా పితికి కాచి, తోడుపెట్టి, పెరుగు అయిన తరువాత దానినే చిలికి వెన్న వేరుచేసి, దానినే తిరిగి కాచిన నెయ్యి కాగలదు. **ఆ నెయ్యినే మళ్ళీ ఆవునకు త్రాపించిన ఆవుకు చక్కని బలము కలుగును. అలాగే సర్వేశ్వరుడు సర్వాంతర్యామి అయినా, సాధనోపచారములు లేకుండా మానవులలో హితము చేయజాలడు.** నువ్వులలో నూనె, పెరుగులో వెన్న, భూమిలో నీరు, కట్టెలో నిప్పు కలసి వుండినటుల, సర్వాంతర్యామి మానవ శరీరములోను, మనసులోను కలిగియున్నాడు. అతనిని వేరు చేయాలంటే ప్రయత్నము, సాధన చేయాలి. అపుడు ఆ రెంటి అభేదత్వము అద్వైతంలో తెలుస్తుంది. అదే మోక్షము అని శంకరులవారు దీనినే అద్వైతోపాసన అని అన్నారు.

ఇక **విశిష్టాద్వైతోపాసన** : ఉపాసించతగిన పరమాత్మ తనకు వేరుగా ఉన్నట్లు భావించాలా? లేక తనతో కలిసి వుండినట్లు భావించాలా సాధకుడు? ఇదీ ప్రశ్న.

ఇక జవాబు : **జీవుడు శరీరానికి ఆత్మ, అలాగే దేవుడు జీవునకు ఆత్మ. అలా భావించి ఉపాసించుటే రామానుజాచార్యుల విశిష్టాద్వైతోపాసన.** ఈ సమస్త భూతజాలము ఎవనిలో ఉన్నాయో, యెవడు ఈ సమస్తానికి అంతర్యామిగా వ్యాపించియున్నాడో ఆ పరమపురుష

పరమాత్మ అనన్యభక్తి (ప్రపత్తి)తోనే లభ్యమవుతాడు, అని పరజ్ఞాన ప్రపత్తి పూర్వకంగా పరమ పురుషోపాసన చేయుటయే విశిష్టాద్వైతము. **"త్వమేవ సర్వం మమ దేవదేవ" నీవే నా గతి, నీవే నా పతి, అనే అనన్య భావముతో ఉపాసించుట.**

**ద్వైతోపాసన, పతీ పత్ని సంబంధమే, జీవాత్మ పరమాత్మ సంబంధం కూడను. అవ్యయుడై విష్ణుభగవానుని తన పతిగా, భర్తగా భరించే వానిగా, తాను భరింపబడే వానిగా, ద్వైతభావముతో ఉపాసించుటయేయని మధ్వాచార్యులు ప్రబోధించిరి.**భగవంతుని చరణాసక్తి లేనిదే జీవన్ముక్తి మాట అటుంచి, కనీసం బుద్ధిశుద్ధి కావటం కూడా అసంభవము అంటారు మధ్వాచార్యులు. మునులూ, ఆత్మారాములు అయినవారికి లౌకిక గ్రంథాలు లేకపోయిననూ సూదంటురాయిలాంటి శ్రీహరి కల్యాణగుణముల విశేషంవల్ల భక్తి పారవశ్యం వారికి కలుగుతూ వస్తుందనియూ, ఆ పారవశ్యములో సిగ్గూ, బిడియములు వదలి శ్రీహరిలో ఐక్యతకు సంసిద్ధుడగు ననియూ, నృత్యము చేయుననియూ, బిగ్గరగా కీర్తనలు చేయుననియూ, అసలైన ఆనందాన్ని అనుభవిస్తాడనియూ, ఈ విశ్వాసాన్ని ఉపాసనం చేస్తూ ఉంటారు. ఈ విధంగా పరానురక్తితో ప్రధానత కలిగి ఉపాసనను జరుపుటే మధ్వాచార్యులవారి అభిమతమని వేనోళ్ళ చాటేరు. పతిని పొందు నిమిత్తమై సతీపతి పరితాపమే అద్వైతోపాసన అన్నారు.

**భారతగీతోపాసన : భారతం పంచమ వేదము. అది ఐహిక, ఆముష్మిక ధర్మాల నిధి. మాధవుడు భారత ధర్మక్షేత్ర రంగస్థలములో తన నాటక సామాగ్రి దింపుకొని ఆడిన అద్భుతమైన ఆట మహాభారతము. భారత నాటకానికి పాత్రధారులును, మాటలును, పాటలును, సమకూర్చిన రచయిత, నటకుడు, దర్శకుడు, నిర్మాత, అంతా ఒక్క మాధవుడే,** ఒక వైపున అధర్మవృద్ధమైన అపార భౌతిక బలం, మరొకప్రక్క ధర్మవృద్ధమైన పరిమిత ఆత్మబలము. ఈ రెంటి ఘర్షణలో పర్యవసానరూపమైన ధార్మిక విజయజ్యోతిగా తనను నిర్దేసించుట ఇదే భారతామృత సర్వస్వం. అదే భగవద్గీత. మహాభారత సారాంశమంతయూ భగవద్గీతలో వున్నది. **"కరిష్యే వచనం తవ" నీవు చెప్పినట్లే చేస్తాను. "స్వధర్మే నిధనం శ్రేయః" ఇదే ఐహిక ధర్మానికి గీటురాయి.** సర్వ శ్రేయస్సులను ప్రసాదించే నీ భక్తిని నిర్లక్ష్యము చేసిచేసి **కళ్ళు మూసుకుని "అహం బ్రహ్మాస్మి" అనే అహంకారముతో బాధపడే నకిలీ బ్రహ్మలకు క్లేశమే ఫలితము.** పొట్టు దంచితే బియ్యము రావు కదా? అసలు కృష్ణుని మాటను నమ్మక, బుద్ధికి తోచినట్లు పోవుట బ్రహ్మతత్వమునకు మార్గము కాదని. **కృష్ణుడే సాక్షాత్ పరబ్రహ్మ అనీ, అనేక విధముల ఉపమాన, ఉపమేయాదులతో** నిరూపించి, నిదర్శనమొసగి, **ప్రబోధించిన సర్వవేదాంతసారము భగవద్గీత. సమస్త శాస్త్రములలోనూ మథించి, అందించిన సుధానిధి, భారతీయ పరమార్థ వాహిని, దానిని కాదనువారుందురా?**

**ప్రకృతి, కాల, కర్మలు మూడునూ ఈశ్వరుని పరతంత్రములు, సత్య స్వరూపుడగు భగవంతుడు, అసత్యములను దేనినీ కల్పింపజాలడు.** కనుక ఒక విధంగా చూస్తే ప్రకృతికూడా సత్యమనే చెప్పవచ్చును. ప్రళయావస్థయందు చేతన అచేతనములు ఈశ్వరునిలో లీనమైయుండును. కాలము ఆద్యంత రహితము అగు ఈశ్వరశక్తి. కర్మసహితము ప్రధాన సత్యమే.

## అద్వైత మతము

ఆనాడు బస్సులు, కార్లు, ఏరోప్లేన్లు లేవు కదా! శంకరులవారు కాలినడకన యావద్భారత దేశంలో కాశ్మీరు మొదలుకొని కన్యాకుమారి వరకు పర్యటించి అద్వైత సిద్ధాంతమును ప్రబోధించాడు. "ఏకమేవాద్వితీయం బ్రహ్మ" - "ఉన్నది ఒక్కటే,రెండు కాదు. చెఱకులోని రసమువలె భగవంతుడు అందరియందు రసస్వరూపుడై ఉంటున్నాడు. కాని మీరు కేవలం రూపనామములను ఆధారం చేసుకోవడంచేత భిన్నత్వాన్ని భ్రమిస్తున్నారు. బంగారము లేక నగలు లేవు, మట్టి లేక కుండలు లేవు. అట్లే ఈ జగత్తులోని రూపనామము లన్నింటికి మూలాధారమైన దివ్యత్వం ఒక్కటే" అని పండితులతో వాదించి ఒప్పించాడు. మండనమిశ్రుని కర్మ సిద్ధాంతమును ఖండించి అతనిని అద్వైత సిద్ధాంతములో ప్రవేశపెట్టాడు. క్రమేణ శంకరులవారి అద్వైత సిద్ధాంతమును అందరూ అంగీకరిస్తూ వచ్చారు. కాని 32వ ఏటనే శంకరులవారు తన శరీరాన్ని త్యజించాడు. కారణమేమిటి? తాను వచ్చిన పని అయిపోయింది గనుక, శరీరాన్ని వదిలేముందు పూరీ, ద్వారక, కంచి, శృంగేరి, బెనారస్ క్షేత్రాలలో ఐదులింగమును పెట్టాడు. మండన మిశ్రునికి సురేశుడని పేరు పెట్టి అతనిని కంచి పీఠాధిపతిగా చేశాడు. విద్యారణ్యులవారు కూడా శంకరుని శిష్యులే.

శంకరులవారు అద్వైతమతమును స్థాపించి, లోకంలో అల్లర్లను చల్లార్చి, ద్వేషాన్ని నిర్మూలించి ఏకాత్మభావముచేత ఆనందమును అభివృద్ధి పర్చడానికి కృషి చేశాడు. కాని తరువాత ఆయన శిష్యులలో ఏమాత్రము ఐకమత్యము లేకుండా పోయింది. శంకరులు చెప్పిన దానినే తాము వ్రాసినట్లుగా వ్రాసుకొని పేరు ప్రతిష్ఠల నిమిత్తమై అనేక పాట్లు పడుతూ వచ్చారు. ఒకరు చెప్పినది ఇంకొకరు అంగీకరించలేదు. క్రిష్టియన్ మతములో కూడా ఇంతే! **జీసస్ పోతూనే** అతని పదకొండుమంది శిష్యులలో భేదాభిప్రాయములు బయలుదేరాయి. ఒక్క మేథ్యూ మాత్రమే జీసస్ చెప్పినవి ప్రచారం చేస్తూ వచ్చాడు. మొట్టమొదట జీసస్ శిష్యునిగా చేరిన పీటర్ కూడా అధికారులు తనను పట్టుకోవడానికి వచ్చేసరికి, "నేను క్రీస్తుఫాలోయర్‌ను కాదు" అన్నాడు. ఈ విధంగా శిష్యులలో

స్వార్థస్వప్రయోజనాకాంక్ష బయలు దేరడంచేత వారి ఉపదేశములన్నీ ఛిన్నాభిన్నముగా మారిపోయాయి.

## అద్వైతము

ఈ దేశపు ప్రజల దృష్టి అంధకారముచే నావృతమై యున్నందున వారు దారితప్పి, ఏవేవో లక్ష్యములు పెట్టుకొని, వాటి నన్వేషించుటలో - ముఖ్య లక్ష్యమును చేరలేకపోయినారు. అట్టి వారికి శంకరులు అద్వైతము బోధించి, వేదములు, ఉపనిషత్తులు, శాస్త్రములు ఏకగ్రీవముగా నంగీకరించిన మార్గమది యొక్కటియేయని తెలియజెప్పినారు. **జీవుడు, ఈశ్వరుడు - ఒకడే గాని ఇద్దరు కాదని చెప్పు మతము అద్వైతము.**

## అద్వైత సిద్ధాంతము

అద్వైత సిద్ధాంతమే ఆధునిక విజ్ఞాన వేత్తల పరిశోధనల కనుగుణ్యముగ నుండుట చేత, వీరు అద్వైతము నంగీకరింతురు. **సర్వకాల సర్వదేశములందును ఈ యేకైక సత్యమే యనుభూతికి వచ్చునట్టిది. ఈ విశ్వమునందు దోచు వైవిధ్యము అజ్ఞానము వలన కలిగినది మాత్రమే యనియు, ఉండునది యంతయు యేకైక సత్యమే ననియు, (సర్వం ఖల్విదం బ్రహ్మ)** నీకు జ్ఞానోదయమైనంతనే నీవే బ్రహ్మ వగుచున్నావు. శోక, మోహ భయము లుండవు. సంసారము నుండి విముక్తి కలుగును."

## భారతీయమతము

**భారతీయ పరమార్థము మహావిశాల భావాలతో, ఉన్నత ఆశయములతో పవిత్ర తలంపులతో ప్రవహించిన వాహిని.** మలుపులేక, కలతకాక అనుగ్రహ సాగరమునకు చక్కని బాటగా యేర్పడిన రాజబాట. ఇంకొకటి: **భారతీయుల యొక్క మత నిర్మాణ మంతటికినీ, భగవంతుడే, ఈశ్వరుడే మూలస్తంభమైయుండగా మరొక దానిని విశ్వసించనక్కరలేదు. అన్ని మతములకు అధిష్ఠానమైన స్థాయిలో ఉన్నత శిఖరమున నిలచిన మతము భారతీయ మతము.** ఈ మతమునకు విరుద్ధమయిన ఆశయములు గల ఇతర మతములను భారతీయ మతము అనేక స్థాయిల యందు, అనేక రీతుల ఖండించినది. **భారతీయుల మరొక మతముల ననుసరింప పని లేదు. ఇందులో లేనివి మరే మతమునందు కానరావు.** భారతీయ మతము నందలి భావములనే ఇతర మతములు ఆదర్శముగా వేరు వేరు రూప నామములతో అనుభవించుచున్నారు. ఇతర మతముల వారు భారతీయ వైదిక మతమును

అనుసరించిన అనుసరించ వచ్చును. కానీ భారతీయులు ఇతర మతముల ననుసరించు నవసరము లేదు. మనము ముఖ్యముగా గమనింప వలసినది **ఆత్మను గూర్చియు, ఈశ్వరుని గూర్చియూ, ఆస్తిక ధర్మమును గూర్చియూ జరిగిన విచారము.** ప్రపంచవాజ్మయమున గూడా ప్రాచీన **తమమైనది ఆర్యవాజ్మయము.** ఇంతకన్నా ప్రాచీనరచనలు యేదేశమందునూ యెచ్చటనూ లేవు. ఒక వేళ వున్ననూ వాటికి వాజ్మయ నామము చెల్లదు. ఇంత పురాతనమైన గ్రంథము వాజ్మయము ప్రపంచముననే ఎందునూ లేదు. ఆర్యుల చిత్త వృత్తులు, వారి వాంఛలు వారి వ్యవహార విషయములు, వారల నెదుర్కొన్న సమస్యలు మున్నగు సంగతులు ఇందు చిత్రింపబడినవి.

**మనకు సంభవించుచుండు మంచిచెడ్డలకు మూల కారణము మన కర్మలే. మన జన్మకు హేతువుకూడా కర్మనే. కర్మము. జన్మము, పునర్జన్మము అను మూడు లక్షణములను విశ్వసించినది హిందూ మతము.**

## హిందువులు

**హృదయమందు ప్రేమ పంటను పండించు కొనువాడే నిజమైన క్రిష్టయన్: వాడే నిజమైన సిక్కు: వాడే నిజమైన హిందువు.** కానీ మానవుడు హృదయంలో ప్రేమ విత్తనాలనే నాటుకోవడం లేదు. ఇంక, పంట ఎట్లా పండుతుంది? ఇటీవల విశ్వ హిందూ పరిషత్‌వాళ్ళు ఇక్కడికి వచ్చినప్పుడు 'హిందూ' అంటే అర్థ మేమిటి? అని అడిగాను. "స్వామీ! హిందువంటే దయతో కూడినవాడు, ధర్మాన్ని ఆచరించే వాడు, దానం సల్పేవాడు" అని అనేక అర్థాలు చెప్పుకుంటూ వచ్చారు. **'హిందూ' అనే పదానికి ఆంగ్ల భాషలో స్పెల్లింగ్ ఏమిటి? అని అడిగాను. H I N D U అని చెప్పారు. అప్పుడు నేను చెప్పాను. H-Humanity (మానవత్వం); I-Individuality (వ్యక్తిత్వం); N-Nationality (జాతీయభావం); D-Divinity (దివ్యత్వం); U-Unity (ఐకమత్యం) ఈ ఐదు లక్షణములతో కూడినవాడే హిందువు"** వీటన్నిటియందూ అంతర్వాహినిగా ప్రవహించు నటువంటిదే ప్రేమ. ఇట్టి ప్రేమతత్వాన్ని పండించు కొనువాడే నిజమైన హిందువు. ఇంక ముస్లిం అనగా ఎవరు? **శాంతంగా జీవితం గడిపేటటువంటివాడే ముస్లిం. శాంతం ఎప్పుడు ప్రాప్తిస్తుంది? హృదయం ప్రేమతో నిండినప్పుడే శాంతం ఆవిర్భవిస్తుంది. కనుక ప్రతి జాతియందు, ప్రతి మతమునందు, ప్రతి వ్యక్తియందు హృదయం ప్రేమమయం కావాలి. ప్రేమనే 'శివం' అన్నారు. అదే మంగళం. ప్రేమ ఎప్పుడూ ఎవ్వరినీ బాధించదు. బాధించనటువంటిదే మంగళకర మైనది. అదియే శివత్వం. ప్రేమతో కూడినవాడే శివస్వరూపుడు: ప్రేమ లేనివాడు శవస్వరూపుడే.**

ఈనాటి మానవుడు తనయందున్న దోషాన్ని తాను గుర్తించుకోవటానికి ప్రయత్నించటం లేదు. పరులయందు ఉన్నటువంటి లేని దోషాలను కూడా వెదకటానికి సహస్ర నేత్రములతో చూడటానికి ప్రయత్నిస్తున్నాడు. ఇదియే ఈనాడు మానవత్వంతో చేరినటువంటి **మాలిన్యం. పవిత్రమైనటువంటి హృదయంలోపల అపవిత్రమైన భావములను చేర్చుకోవటం చేతనే ఈ మాలిన్యం ఈ రూపాన్ని ధరించింది.**

ప్రపంచంలో ఎక్కడ చూచినా ఒకరినొకరు దూషించు కోవటమే; ఒకరినొకరు విమర్శించుకోవటమే. ఒకరిలోన్ను తప్పులు మరొకరు వేలిత్తి చూపటమే. **తప్పులు వెదకేవారే కనపడుతున్నారుగాని మంచిని వెదికే మానవులు కనిపించటం లేదు. మంచిన వెదికేవాడే నిజమైన మానవుడు.**

**"హృదయమునందు ప్రేమపంటను పండించు కొనేవాడే, వాడె క్రైస్తవుండు" A Christian should be an ideal Christian. అనగా తన హృదయము నందు ప్రేమ పంటను పండించుకోవాలి. అతనే నిజమైన క్రైస్తవుండు.**

**సిక్కులనగా ఎవరు?టర్బన్ పెట్టుకొని కత్తిగల వారు మాత్రమే కాదు. తన హృదయమునందు ప్రేమ పంటను పండించుకున్నవాడే నిజమైన సిక్కు. పరులను చంపటం, పరులను హింసించటం సిక్కుల లక్షణం కాదు.**

ఇక **హిందువుడెవరు? 'హృదయమునందు ప్రేమపంటను పండించుకొనువాడే హైందవుడు"** కాని ఈనాడు ఆ ప్రేమపంట ఎక్కడా కనిపించటం లేదు. ప్రేమ విత్తనాలకు కూడా నాటటం లేదు. ఇంక పంట ఎట్లా పండుతుంది? ప్రేమ లేనిమానవడు 'హిందు' అని చెప్పటానికి ఎలా సాధ్యమవుతుంది. ప్రేమతత్త్వమును పండించుకొనకుండా నేను హిందువుని, హిందువుని అనుకుంటే ఏమి ప్రయోజనం? **ఇంక ముస్లిం. ఇతను కూడా ప్రేమపంటను పండించుకొనువాడే.** వీరు 'అల్లా' అని పిలుస్తారు. అల్లా అనగా దేవుడు. **'అల్లాహో అక్బర్' అనగా దేవుడు గొప్పవాడు.** శాంతంగా జీవితాన్ని గడిపేటటువంటివాడే 'ఇస్లాం'. ఈ శాంతం మనలో ఎప్పుడు ప్రారంభమవుతోంది? ప్రేమతో హృదయము నిండినప్పుడే మనలో శాంతం ఆవిర్భవిస్తుంది, కనుక ప్రేమలేకుండా శాంతిలేదు. కనుక ప్రతి జాతి యందు, ప్రతి మతమునందు ప్రతి వ్యక్తియందు ప్రేమ మయమైనటువంటి హృదయం కావాలి.

## మతకర్తలు

ఈ చిత్ర విచిత్రమైన చరాచర ప్రపంచమునకు సృష్టికర్త ఒకడున్నాడు. అతడు సర్వజ్ఞుడు, సర్వశక్తిమయుడు. సర్వవ్యాపకుడు. అట్టి భగవంతుని అనేకమంది అనేకమైన పేర్లతో స్మరిస్తూ, భజిస్తూ తరిస్తూవచ్చారు. మానవునికి ఐకమత్యం, సంఘీభావం భక్తి ప్రపత్తులు అత్యవసరం. ఇట్టి పవిత్రమైన మూడు సూత్రములను మానవలోకంలో అభివృద్ధి చేయతలంచి అనేకమంది మహనీయులు కొన్ని మతములను స్థాపిస్తూ వచ్చారు. **మతము అనగా కేవలం ఒక పరిమితమైనది కాదు. మానవాభ్యుదయమునకు జీవిత పరమావధికి మార్గమును చూపించేటటువంటిదే మతము. మానవుని యందలి మానవత్వమును ప్రేరేపించి, పదిమందితో కలిసి ఆనందంగా జీవితము గడిపింపేచేసేది మతము జీవునకు దేవునకు మధ్యనున్న సంబంధ బాంధవ్యాన్ని చేకూర్చుటటువంటిదే మతము. అనేకత్వమునందలి ఏకత్వమును నిరూపించేటటువంటిదే మతము. ప్రేమ, త్యాగము, సేవ, ధర్మము మున్నగునవి మతమునకు ప్రధానమైన అంగములు. మానవుని యందలి దివ్యభావములను, నవ్యభావములను వ్యాపింపచేసి సమాజమునకు అందింప చేసేది మతము. మానవ జీవితంలో ఔన్నత్యమును, ఆనందమును, సఖ్యతను నిరూపింప జేసి, జగత్తునకు ఏకత్వాన్ని బోధించునదే మతము.**

ఈనాడు ఇటువంటి దివ్యమైన మతమును సంకుచితమైన భావములతో అనుభవిస్తూ, ఆచరిస్తూ, ప్రచార ప్రబోధలు సల్పుతూ ఉండటం చాలా దురదృష్టకరమైన విషయం. ఈ మతమే సమస్త మానవజాతికి అంతర్భాగమైన ప్రవాహము. **ఇట్టి పవిత్రమైన మతరహస్యమును సమాజమునందు వ్యాపింపచేసే నిమిత్తమై మత కర్తలు కొన్ని విధాలైన నిబంధనలుగావించి జగత్తులో ప్రచార ప్రబోధములు సలుపుతూవచ్చారు.** బౌద్ధమతం-అమోహత్వాన్ని, పవిత్రతను, దివ్యత్వమును ప్రచారం చేయుటకు **"సత్యం, అహింసలే" ప్రధానమైన సూత్రములని ప్రచారముచేస్తూ వచ్చింది. క్రిస్టియన్‌మతం "మనవులందరు భగవంతుని బిడ్డలే"** ప్రతి ఒక్కరు సోదరసోదరీ భావము పెంచుకొని, దివ్యమైన దైవత్వమును ప్రార్థించి, ఆనందమును అనుభవించాలని ప్రచారముచేస్తూ వచ్చింది. **"All are one be alike to everyone"** అని ప్రబోధలు సల్పినవాడు జీసస్. ఇంక మహమ్మదీయ మతమునందు ఆత్మరీతిగా "అందరూ సోదరులే". ఈ సోదర భావమును అభివృద్ధి పరచుకొని జగత్తునకు శాంతి భద్రతలు చేకూర్చటానికి ప్రార్థనే ప్రధానమైనటువంటి మార్గమని వారు ప్రబోధించిరి.

## విశ్వమతము

ఒకే అనంతమైన ఆకాశము నుండి వర్షము కురుస్తుంది. అది భూమి మీద పడేవరకు చినుకులుగా వుంటుంది. కానీ, భూమి మీద పడిన వెంటనే ప్రవహిస్తుంది. ఏ నేలలో ఎటెటు దిగవలెనో అట్లు దిగుతుంది. అదే విధంగా - **ఒకే పవిత్రమయిన భావముతో మానవులు జన్మిస్తారు. కాని భూమిమీద పడిన వెంటనే రకరకాలుగా మారి పోతారు. కాని ఈ జన్మకు ఆధారభూతమైన, మానవుని అంతర్గతమైన దివ్యత్వము ఒక్కటే అని గుర్తించాలి.** ఇది చాలా ముఖ్యమైన విషయము ఎందుకనగా మన భారతీయులలోనే చాలా మందికి మన దేశములోనున్న అనేక మతస్థుల, కులస్థుల సంస్కృతులను గురించి కొంత నిరసన భావం ఏర్పడివుంది. **భారత దేశంలో చాలా రకములైన మతములుండుటవలన కలహములు భేదాభిప్రాయములు ఏర్పడినవి - అని భావిస్తున్నారు. భారతీయులు అనేకమంది దేవుళ్లను పూజిస్తారు అని హేళన చేస్తారు. కానీ బాగా ఆలోచించినట్లయితే ఈనాటి కలహములకు, భేదాభిప్రాయములకు, కారణము మతములు కావు. ఏకేశ్వరోపాసన - ఏకత్వమును ప్రబోధిస్తున్న క్రైస్తవులు, అడవిలో వున్న మృగముల కంటె హీనంగా మనుష్యులను అణ్వాయుధములచే చంపేస్తున్నారే! దీనికి ఎవరు కారణము? మతమా? కాదు కాదు. వ్యక్తిగతమైన చెడు బుద్దులు. తమతోటి వారిని హింసిస్తున్నారు. మతము మీద ప్రతిదీ వేయడం ఒక పరిపాటైపోయింది.**

మతములన్నియు చేరి మంచినే బోధించె
తెలిసి మెలగవలయు తెలివితోడ
మతులు మంచివైన మతమేది చెడ్డది!
వినుడు భారతీయ వీరసుతుడా.

కనుక మతమునకు సంబంధించిన విషయములలో మనము ప్రవేశించకూడదు. **సర్వమతముల వారిని గౌరవింపవలయును. అన్ని మతముల ఆకారమే ఈ దివ్య మతమైన విశ్వమతము యొక్క రూపము, అని గుర్తించాలి. గ్రహించాలి, ప్రచార ప్రబోధలు సలుపాలి.**

## గౌతమబుద్ధుడు (బుద్ధుడు)

ఒకానొక సమయంలో బుద్ధుడు దేశంలోని వివిధ ప్రాంతాలలో పర్యటిస్తూ, ప్రజలకు సత్యబోధలు సల్పుతూ వచ్చాడు. ఒక రోజున ఒక గ్రామం చేరుకునేసరికి అతడు బాగా

అలసిపోయాడు. అప్పుడు తన శిష్యుల్లో ప్రధానుడైన నిత్యానందుణ్ణి పిలిచి "నాయనా ! ఈ రోజు నేను కొంత విశ్రాంతి తీసుకుంటాను. ఇక్కడ చేరిన భక్తులకు నీవేదైనా సద్బోధలు సల్పు" అని చెప్పి, విశ్రాంతి తీసుకోవడానికి లోపలికి వెళ్ళాడు. కాని, నిద్ర రాక పోవడంచేత నిత్యానందుని ప్రసంగాన్ని వినసాగాడు. నిత్యానందుడు ఏమని బోధిస్తున్నాడు? "ప్రజలారా! బుద్ధునివంటి మహనీయుడు ఇంతకు పూర్వం పుట్టలేదు, ఇకముందు పుట్టబోడు. బుద్ధునికి సమకాలీనులుగా పుట్టడం మీ అదృష్టం. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడానికి తగిన కృషి చేయండి" అన్నాడు. ఈ మాటలు విని అక్కడ గుమికూడిన భక్తులు పెద్ద ఎత్తున కరతాళ ధ్వనులు చేశారు. వెంటనే బుద్ధుడు లేచి వచ్చి నిత్యానందుని భుజంపై చేయి వేసి "నాయనా! నిత్యానందా! నీ వయస్సెంత?" అని ప్రశ్నించాడు. నిత్యానందుడు "నలభై సంవత్సరములు స్వామీ"! అన్నాడు. "ఇంతవరకు ఎన్ని పట్టణాలు చూశావు"? అని ప్రశ్నించగా "రెండు పట్టణాలను మాత్రమే చూశాను స్వామీ!" అన్నాడు. "ఎంతమంది మహనీయులను దర్శించావు?" అని మళ్ళీ ప్రశ్నించగా, ఎవ్వరినీ దర్శించలేదనిసమాధానం చెప్పాడు. అప్పుడు బుద్ధుడు చెప్పాడు, "పిచ్చివాడా! నీ వయస్సు నలభై సంవత్సరాలు. నీవు రెండు పట్టణాలను మాత్రమే చూశావు. ఏ మహనీయులనూ నీవు దర్శించలేదు. అలాంటప్పుడు బుద్ధునివంటి మహనీయుడు ఇంత వరకు పుట్టలేదు. ఇకముందు పుట్టబోడు అని చెప్పడానికి నీకేమి అధికారం ఉంది? నలభై సంవత్సరములకు పూర్వం ఎవరు పుట్టారో నీకేమి తెలుసు? ఎందరో మహానుభావులు పుట్టారు. మున్ముందు ఇంకెందరో మహానుభావులు పుట్ట బోతున్నారు. మహనీయులే పుట్టకపోతే ఈ జగత్తే నిలువలేదు. **"జగతియందు పుణ్య పురుషులు లేకున్న జగము లెట్లు వెలుగు పగలుగాను?"** మహనీయులు ప్రభావముచేతనే ఈ జగత్తు ప్రకాశిస్తున్నది."

బుద్ధుడు ఆత్మజ్ఞానం నిమిత్తమై అనేక సాధనలు సల్పి కట్టకడపటికి ఇది పండితులు బోధించేది కాదనీ, గ్రంథపఠనంచేత లభించేది కాదనీ గుర్తించాడు. మొట్ట మొదట భగవంతుడు ప్రసాదించిన పంచేంద్రియాలను పవిత్రం గావించుకొన్నప్పుడే ఆత్మజ్ఞానానికి తగిన అర్హత ప్రాప్తిస్తుందనీ, పంచేంద్రియాలను సద్వినియోగ పర్చుకోవడంద్వారానే మానవుడు తనయందున్న దివ్యత్వాన్ని గుర్తించుకోగలడనీ బోధించాడు. నిత్యజీవితంలో అనుభవించే ఇంద్రియాలనే పవిత్రం గావించుకోలేనివాడు ఇంక ఇంద్రియాతీతమైన దివ్యత్వాన్ని ఏరీతిగా గుర్తించగలడు? కనుకనే **మొట్టమొదట సమ్యక్ దృష్టిని అలవర్చుకొమ్మని బోధించాడు బుద్ధుడు. సమ్యక్‌దృష్టివల్ల హృదయంలో సమ్యక్‌భావములు ఆవిర్భవిస్తాయి.**

సమ్యక్‌భావములవల్ల సమ్యక్‌వాక్కు వెలవడుతుంది. సమ్యక్‌వాక్కును ఆచరణలో పెడితే అది సమ్యక్ కర్మగా రూపొందుతుంది. సమ్యక్‌కర్మలను చేస్తూ ఉండడమే సమ్యక్‌సాధన అవుతుంది.

**సమ్యక్‌దృష్టి అనగా ఏమిటి?** పవిత్రమైన దృశ్యములను మాత్రమే చూడాలి. ఎందుకంటే చూసిన దృశ్యములన్నీ హృదయంపై ముద్రించు కొని పోతాయి. కనుక కన్నులున్నాయి కదా అని దేనిని పడితే దానిని, ఎవరిని పడితే వారిని చూడకూడదు. మన శాస్త్రజ్ఞాన మంతయు నేత్రములపై ఆధారపడియున్నది. నేత్రమే శాస్త్రము, దృష్టియే సృష్టి. కనుక పవిత్రమైన జ్ఞానం ప్రాప్తించాలంటే దృష్టిని పవిత్రంగా ఉంచుకోవాలి. దృష్టియే మన హృదయంలో సంకల్పములను సృష్టిస్తుంది. దృష్టి మన హృదయక్షేత్రంలో నాటుకొనే విత్తనంవంటిది. కనుక దృష్టి మంచిదిగా ఉన్నప్పుడే హృదయంలో మంచి సంకల్పములు సృష్టింప బడతాయి. కానీ మానవుడీనాడు అసహ్యకరమైన, అసభ్యకరమైన ఘోరమైన దృశ్యములను చూడడం చేత దుర్భావములకు లోనై మానవత్వాన్ని కోల్పోయి మృగంగా మారి పోతున్నాడు. చిట్ట చివరికి దుఃఖాన్ని అనుభవిస్తున్నాడు. ఎట్టి దృష్టియో అట్టి హృదయం; ఎట్టి హృదయమో అట్టి సంకల్పం; ఎట్టి సంకల్పమో అట్టి వాక్కు. కనుక సమ్యక్ దృష్టివల్ల సమ్యక్‌భావం, సమ్యక్ భావంవల్ల సమ్యక్ వాక్కు ఆవిర్భవిస్తాయి. చూసినదానిని తలచి, తలచినదానిని చెప్పి, చెప్పినదానిని చేయాలి. దీనినే 'సమ్యక్‌కర్మ' అన్నాడు బుద్ధుడు. సమ్యక్‌కర్మల నాచరించడమే సమ్యక్‌సాధన. దుర్భావములను వీడి సద్భావములను పోషించుకొని సత్కర్మల నాచరించడమే సమ్యక్‌సాధన. సత్కర్మలలో ప్రవేశించడమే సరియైన సాధన. పూజలు, జపములు, ధ్యానములు ఇవన్నీ సత్కర్మలు మాత్రమేకాని సాధనలు కావు. సమ్యక్‌దృష్టి, సమ్యక్‌భావము, సమ్యక్‌వాక్కు, సమ్యక్‌కర్మ, సమ్యక్‌సాధన - వీటన్నింటితో కూడినదే సమ్యక్‌జీవనం.

## బుద్ధునిబోధ

బుద్ధుడు కూడ వేదభావములను. వేదముయొక్క ఆశయములను ఆచరించి నిరూపించాడు. మొట్టమొదట **"బుద్ధం శరణం గచ్ఛామి"** అన్నాడు. ఇది వ్యక్తి గతమైనది. క్రమక్రమేణ **"సంఘం శరణం గచ్ఛామి"** అన్నాడు. వ్యక్తిగతమైన భావములు సంకుచితములుగా వుంటాయి. దీనినే సర్వస్వముగా నీవు భావించవద్దు. సముద్రములో బిందువు వంటిది యిది. కనుక "సంఘం శరణం గచ్ఛామి" నీ సంఘములోపల సంఘస్వరూపుడుగా విశాలహృదయాన్ని యేర్పరచుకోమన్నాడు. సంఘమునకు రూపము లేదు. వ్యక్తుల సమూహమే సంఘము.

వ్యక్తిత్వము అనేకవిధములుగా చేరినపుడే సంఘస్వరూపము ధరిస్తుంది. Life into infinity is Divinity. విశాలమైన ఆత్మతత్వాన్ని చేరుకున్నప్పుడే యెంతో విశాలమైన తత్వముగా రూపొందుతుంది. Life into infinity. ఇదే దైవత్వము. విశాలమైన హృదయులుగా కమ్మన్నాడు. ఈ సంఘముయేదో కొంత గుంపుతో మాత్రమే కూడి వుంటాది. ఒక దేశపు సంఘమునకు మరో దేశపు సంఘమునకు సంబంధముండదు. ఒక పేరుతో వుండిన సంఘము మరొక పేరుతో వుండిన సంఘమునకు సంబంధముండదు. కనుక సంఘమునకు కూడ హద్దులుంటాయి. హద్దులతో కూడిన సంఘములు గొప్పవి కావు. కనుకనే సర్వాత్మక భావమును ధరించి **"ధర్మం శరణం గచ్ఛామి"** అన్నాడు. **"ధారయతాతి ధర్మః"** జగత్తును ధరించినది ధర్మము. ధర్మమంటే యేమిటి అని విచారిస్తే ఆపదార్థము యొక్క గుణమే పదార్థము యొక్క ధర్మము. గుణమే దాని యదార్థము. పదార్థమే వస్తువు. అదే పరబ్రహ్మతత్వము. పరబ్రహ్మతత్వమును ఆధారము చేసుకున్నదే ధర్మము.

## జైనమతము

**జైనమతము నందుకూడనూ ఇదే విధమైన అంతరార్థమును ప్రబోధిస్తూ వచ్చాడు, మహావీరుడు. ఇంద్రియములను పలు పలు విధములుగా ప్రవహింప జేసినప్పుడు అనేక విధములైన మార్పులు, కూర్పులు జరుగుతూ వుంటాయి.** ఈ ఇంద్రియములయొక్క ఏకత్వాన్ని మనం సాధించినప్పుడే ఇట్టి దివ్యమైనటువంటి ఆత్మతత్త్వము మనకు అర్థమవుతుంది. కనులకు చూచే శక్తి వుంటుంది. చెవులకు వినే శక్తి ఉంటున్నది. చూచునది, వినునది, పలుకునది తలంచు నది సర్వమునకూ ఒక్క దివ్యత్వమే ఆధారము. కనుకనే ఈ అన్నింటిని ఏకత్వాన్ని చేసినప్పుడే జయత్వాన్ని పొందుతాం. కనుకనే మహావీర **త్యాగికి "జయ" అనే బిరుదునుకూడా అందించారు. "జయ" అనగా ఏకత్వమును గావించటమే జయత్వము యొక్క అంతరార్థం. అందరూ ఒక్కటే. దేహములు వేరు,** ఆభరణములు వేరైనప్పటికినీ సువర్ణము ఒక్కటే. అదేవిధముగనే ఏకత్వాన్ని భావించేటటువంటి దివ్యాత్మ తత్త్వమునే సర్వ మతములూ ప్రబోధిస్తూ వచ్చాయి. బౌద్ధమతము నందుకూడనూ ఇలాంటి ఏకత్వమునే సూచిస్తూ వచ్చింది. ప్రతి మానవుని యందును నిజముగా ఆవిర్భవింపవలసినది ప్రేమ తత్త్వము. **ఏది లేకపోయినా జీవితం సాగిపోవచ్చును గాని, ప్రేమ లేకపోతే జీవితం స్తంభించిపోతుంది. ప్రతి జీవికి ప్రేమయే ప్రాణం. ఇలాంటి ప్రేమతత్త్వము కలిగినప్పుడే అహింస, హింసకు పూనుకోదు.** దివ్యత్వమైన మానవత్వం రాణించవలెననిన ప్రేమ తత్త్వమును అభివృద్ధి గావించుకొనవలెను. కనుక ప్రతి మతమునందలి ప్రబోధలు సరియైన

రీతిలో అర్థం చేసుకుంటే ఏకత్వాన్ని మాత్రమే గుర్తింపజేస్తుంది. మతభేదములనేటటువంటివి మానవుని మతిని చెడగొడుతున్నాయి. కనుక మతభేదములను ఎవ్వరూ పాటించరాదు. కేవలం ఒక్కొక్క మానవత్వం భిన్నత్వంగా గోచరించినప్పటికినీ, అందున్నటువంటి ధాతృతత్త్వము ఒక్కటిగానే మనం విశ్వసించాలి. ఇలాంటి పరిస్థితుల యందు మానవత్వాన్ని వికసింపజేసి, ప్రకటింపజేసి, వికాశింపజేసే నిమిత్తమై అప్పుడప్పుడు అవతారములు, మహాపురుషులు, దైవాంశ సంభూతులు ఆవిర్భ విస్తుంటారు.

## మతము/మతములు

ఒకానొక సమయమున Munshi (Bhavan's అధిపతి) Bombay లో ఒక పెద్ద సమావేశాన్ని ఏర్పాటు చేసాడు. ఈ సభలో స్వామి మాట్లాడవలసి వచ్చింది. వారికి నిజంగా తెలివితేటలు ఏమాత్రము వున్నట్లు నాకు కనబడలేదు. ఈ సమావేశానికి పెద్ద పెద్ద Doctors, Vice Chancellors, Principals, Professors అందరూ వచ్చారు. ఎవరికి వారు చాల తెలివికలవారని భావించుకున్నారు. అది కాదు **తెలివికి లక్షణం మనయొక్క ప్రవర్తనలో వుంది అంతా. చెఱకుకు విలువ దాని రసము వలననే, చెఱకు మాదిరే వుంటుంది.** వెదురు బొంగు. దానికి దాని ఒడ్డు పొడుగుకు ఇస్తాము, విలువ. అట్లే **మానవుని విలువ అతని గుణముబట్టే**. సరే ఒకరు ఒక ప్రశ్న వేసారు. 'స్వామి ఈనాడు హిందువులు, బౌద్ధ మతస్థులు, Christians, Jains ఒకరికొకరు భేదాభిప్రాయములతో కలహించుకుని ద్వేషిస్తున్నారే. దీనికి కారణమేమిటి" అని అడిగారు. నిజంగా ఈ కలహాలకు కారణము వారి వారి దుర్గుణములే కాని మతములు కావు. అన్ని మతములు మంచినే చెప్తూవచ్చాయి. కానీ మతమందున్న **దురభిమానమే అన్నింటికి మూలము**. ఈ దురభిమానము చేతనే ఒక మతస్థులు మరొక మతస్థులను ద్వేషిస్తున్నారు. ఇలాంటి తత్వము కలవారిని మతస్థాపకులు అనరాదు. వారు కిరాతకులు. వారి చిన్ని బుద్ధిని వారు బహిర్గతము చేసారు. అంతే. నేను చివరకు వారికి సమత్వమును గురించి చెప్పాను. మీరందరు చక్కగా నేను చెప్పేదాంట్లోని అర్థము చక్కగా గుర్తించాలి. హైందవమతము ఎప్పుడు పుట్టిందో ఎవ్వరికి తెలియదు. ఎవరికి తోచిన రీతిలో వారు చెప్తున్నారే కాని అసలు సంగతి ఎవరికి తెలియదు. అయితే తరువాత వచ్చిన బౌద్ధమతమునకు, క్రైస్తవమతమునకు చక్కగా కాలనిర్ణయము చేసినారు. **1918 సం॥పూర్వము వచ్చింది. క్రైస్తవ మతము. ఇట్లే ఇస్లాము, బౌద్ధమతము, సుమారు 900 సంవత్సరముల క్రిందటనే వచ్చినవి. ఇట్లా ఏర్పడినపుడు ఏమి జరిగింది - అనాదిగా వుండినది హైందవ మతము, 2000 సంవత్సరములకు ముందు పుట్టినది క్రైస్తవమతము, 900 సంవత్సరములకు**

**పూర్వ ముద్భవించినవి తదితర మతములు, ఇస్లాము. వీటికి పరస్పర సంబంధమును మనము ఈ విధముగ చెప్పవచ్చును. హైందవమతము Grand Father, బౌద్ధమతము, క్రైస్తవమతము Father, ఇస్లాము తదితర మతములు Grand sons - అని చెప్పవచ్చును. కాబట్టి ఇది ఒక Family వంటిదే. (ప్రత్యేకమైన Fighting కాదు)కనుక మన మందరము ఒక కుటుంబమునకు చెందినవారము. అన్న విషయంమనం చక్కగ గుర్తించాలి. ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క మతమునకు** ప్రాముఖ్యత వస్తూవుంటుంది. దీనికి సంబంధించిన ఇంకొక ఉదాహరణ చెప్తాను.

ఒక ఏనుగు దగ్గరకు కొంతమంది గ్రుడ్డివారు వెళ్ళారు. ఈ కథ మీకందరికి తెలిసివుంటుంది. ఒక గ్రుడ్డివాడు ఏనుగు కాలును తడిమి చూచి "అయ్యా ఏనుగు ఒక స్తంభము వలె ఉంది'' అని అన్నాడు. మరొకడు ఏనుగు చెవులు పట్టుకొని పరీశీలనగా "ఏనుగు అంటే ఒక చేటవలె వున్నట్లుంది'' అని అన్నాడు ఇంకొకడు, తోకను తడిమి "ఏనుగు ఒక పాములా వుంది'' అని అన్నాడు మరొకడు తొండము పట్టుకొని ఏనుగు ఒక తీగలా వుంది అన్నాడు. వారి వారి అనుభవమును బట్టి వారికి తోచిందివారు చెప్పారు. ఇందులో ఎవరిదీ తప్పు? అందరిది Correct, అయితే ఏనుగు స్వరూపము ఎట్లు ఏర్పడుతుంది? - ఈనలుగురు గ్రుడ్డివాండ్లు చెప్పిన అంతములన్నీ కలిసి నపుడే. ఇదే విధంగ ప్రతి మతమువారు ఏనుగు సమగ్ర రూపంలోని ఒక్కొక్క అంగము యొక్క తత్వాన్ని చెప్పుతున్నారే గాని వారు స్పృశించని ఇతర అంగముల తత్వమును చెప్పుటలేదు. అన్ని అంగములను చేర్చిన **ఏనుగు సమగ్రరూపమును మనము చూడవచ్చును. అదే విధముగ ఈ వివిధ మతముల ప్రభోదములన్నియు చేర్చితే అదే విశ్వమత మవుతుంది. ఇదే నిజ మతము, ఈ సత్యాన్ని గుర్తించి మతకలహములు లేకుండ సమత్వమును పెంపొందించు కోవాలి. ఎవరి మతమును వారు స్వేచ్ఛగా అనుసరించ వచ్చును. కాని అన్ని మతములవారి గమ్యము ఒక్కటే. దివ్యత్వము, పవిత్రత ఒక్కటే.** ఒక గ్రామంలో నున్న చెఱువుకు నలువైపుల మెట్లు వుండును. నలువైపుల నుండి ఆ ప్రాంతమువారు వచ్చి దానిలో నీరు తీసికొనిపోతారు. వారు వివిధములైన దిక్కులనుండి వస్తారు. అయితే వారు వచ్చేది ఆ చెఱువుకే - ఆ చెరువులో నీరు కొరకే ఈ సత్యాన్ని గుర్తించాలి.

కొంతమంది వ్యక్తులను ప్రత్యేకంగా
గుర్తించడానికి లేక కొన్ని సందర్భాలలో
కొన్ని అవసరాల నిమిత్తమై
ధరించే దుస్తులవలె, ప్రపంచములో

అనేక మతములను ఉపయోగించు
కోవడం జరుగుతోంది.

## ఒక్కటే

స్వీట్లు వేరుగా నుండినా! అందులోని చక్కెర అంతా ఒక్కటే
వ్యక్తులందరు వేరు వేరుగా నుండినా అందరిలో తత్త్వమంతా ఒక్కటే.
లక్ష్యము ఒక్కటే. మార్గములు వేరు వేరైనప్పటికి గమ్యం ఒక్కటే. కనుకనే -
మతములన్నియు వేరు మార్గంబు ఒక్కటె
వస్త్రభేదము వేరు వస్తువొకటె
శృంగారములు వేరు బంగారమొక్కటె
పశులవన్నెలు వేరు పాలు ఒకటె
జీవ జంతువులు వేరుజీవుండు ఒక్కడే
జాతిరీతులు వేరు జన్మమొక్కటె
దర్శనంబులు వేరు దైవంబు ఒక్కడె
పూలజాతులు వేరు పూజ ఒక్కటె
తెలియ లేకను మానవుల్ తెలివి దప్పి
బ్రతుకు కోసము బహుబంధబద్ధులైరి
ఇంతకన్నను వేరెద్ది యెరుకపరతు
సాధు సద్గుణగణ్యులౌ సభ్యులార!

ఈ బ్రతుకు కోసము ఇన్ని మార్గములు పడుతున్నారేకాని నిజముగా యోచిస్తే అన్నీ ఒకటే. ఏ మతాన్ని మనము విమర్శించకూడదు. నా మతము గొప్పది, నీ మతము తక్కువని వాదోపవాదములు చేయటము సంకుచిత బుద్ధులు స్వభావము. అన్ని మతములు ఒక్కటే, అన్ని మతముల బోధలు ఒక్కటే, అన్ని మతములు సత్యము ఒక్కటే, ఈ విధమైన సమత్వాన్ని మనము అనుసరిస్తూ పోతుంటే తప్పక మనలో దివ్యత్వము ఆవిర్భవిస్తుంది.

**ఈ దైవ సృష్టిలో కనబడే భిన్నత్వంలో వుండే ఏకత్వం గుర్తించి వర్తించుటే మానవ విజ్ఞతకి, జీవితానికీ సార్థకత. ప్రతి మతము దైవానుగ్రహప్రాప్తి అనే లక్ష్యమునకు ఒక మార్గం. మతానికొకదైవం లేదు. దైవానికొక మతంలేదు.**

**అన్ని మతముల ప్రబోధసారము ఒక్కటే దైవ పితృత్వం, మానవ సోదరత్వం Fatherhood of God and Brotherhood of Man.** భగవంతుడు ప్రేమ స్వరూపుడు. మానవాళి సర్వదా పెంచుకోవల్సిందీ, పంచుకోవల్సిందీ పరస్పర ప్రేమయే. అదే మానవ శాంతియుత సహజీవనానికి ఆధారం గమ్యం కూడాను.

మతము క్రమశిక్షణను నేర్పి హితముగూర్చు
ఆత్మశక్తియు తేజంబు అధిక పరచు
దాని మర్మంబు నెరుగక దాటుకొన్న
జాతి సంస్కృతి నశియించి జబ్బుపడును"

**ఒక మతము ఉత్తమమైనదనియు, మరొక మతము హీనమైనదనియు భావించుకోవటం, భేధములు పెంచుకోవటం - ఇది అజ్ఞానము యొక్క ప్రభావం. అన్ని మతములయొక్క ప్రభావం పవిత్రమైనదే. అన్ని మత సిద్ధాంతములు సత్యమైనవే. సర్వ మతముల సారము, సమస్త ధర్మములయొక్క మూలము, సర్వ శాస్త్రముల యొక్క కీలకము సత్యస్వరూపమైన ఆత్మ తత్త్వమే.** మార్గములు వేరువేరైనప్పటికీ గమ్యమొక్కటేననే సత్యాన్ని గుర్తించి వర్తించటమే మానవత్వముయొక్క ప్రధాన కర్తవ్యం, త్యాగం, ప్రేమ, దయ, నీతి, నిజాయితి-ఇలాంటి పవిత్రమైన విషయములు సర్వ మతములయందు సామాన్యమైనవిగా ఉన్నాయి. అనేకత్వంలోని ఏకత్వాన్ని గుర్తింప చేసుకొనే నిమిత్తమై ప్రతి మతమునందుకూడనూ భిన్నభిన్న మార్గములు ప్రబోధిస్తూ వస్తున్నాయి, భారతీయుల సిద్ధాంతము, భారతీయుల సంస్కృతి. భారతీయుల పవిత్రమైనటువంటి మార్గములు అన్ని మతములయందు అంతర్భూతమై, అంతార్వాహినియై రాణిస్తూ వస్తున్నవి.

**"ఏకోవసి సర్వభూతాంతరాత్మ"** అనేటటువంటి సత్యాన్ని పురస్కరించుకొని, సర్వ జీవుల యందు ఉన్నది "ఏకాత్మయే' అనే సత్యాన్ని కూడనూ హెచ్చరిస్తూ వచ్చింది భారతీయ సంస్కృతి. బౌద్ధ మతమునందు, ఇస్లాం మతమునందు, క్రిష్టియన్ మతమునందు ఇట్టి ఏకత్వాన్ని అనేక స్థానములందు హెచ్చరిస్తూ వచ్చింది. శారీరకంగా, కర్మరీతిలో భిన్నంగా గోచరించినప్పటికినీ, ఆత్మతత్త్వము నందు అందరూ ఒక్కటేననే సత్యాన్ని క్రిష్టియన్ మతము వెల్లడిస్తూ వచ్చింది. ఒక్క ప్రభువు యొక్క బిడ్డలే సర్వులూ అనియూ, అందరూ సోదర భావమునే పెంచు కోవలెననియూ, దైవంయొక్క పితృత్వాన్ని, మానవుని యొక్క సోదరత్వాన్ని అభివృద్ధి పరచుకోవలెనని బోధించాయి. "ఏకం సత్ విప్రా బహుధా వదన్తి" ఉన్నది ఒక్కటే. కాని భిన్నత్వం నీ మానసిక చర్యలే. భగవంతునికి అర్పితం

కావలసినది ఏకాత్మభావమే. **భారతీయులు రెండు హస్తములు చేర్చి 'నమస్కారము' అని ఉచ్ఛరిస్తూ వుంటారు. ఈ నమస్కారంయొక్క అంతరార్థం ఏమిటి? అనేకత్వాన్ని ఏకత్వంగా చేర్చటమే ఈ నమస్కారము యొక్క అంతరార్థం. అదేవిధముగనే ఇస్లాంమతంలో "సలామ్' ' అన్నారు. "స" అనగా సాలోక్య, సారూప్య, సామీప్య, సాయుజ్యములు. సత్స్వరూపుడు, సత్యరూపుడు అని అర్థము. సత్, చిత్ ఆనంద మయుడు. "ల" అనగా లయము. ఈ సకారస్వరూపుడైన పరమాత్మయందు లయమై ఉండటమే "సలాం" అని అర్థము. క్రిష్టియన్ మతము నందుకూడనూ "ఏసు" అని పిలుస్తూ వచ్చారు. "ఏ" అనగా ఏకత్వము. "స" అనగా దివ్యత్వము. దైవము ఒక్కడే. అనేకము లేదు. కనుక ఏకత్వమైన దివ్యత్వంలో మానసిక తత్త్వములు అంకితం గావించుకోవటమే ఈ "ఏసు" యొక్క అంతరార్థము.**

ఈ జగత్తునందు రెండువేల సంవత్సరము లకు పూర్వం రోమన్ దేశంలో యూదులు అనే మతంవారు వుండేవారు. ఈ **యూదులకు 'యెహోవా'కు మించిన దైవం మరొకడు లేదని వారి విశ్వాసం.** అతి శీఘ్రకాలంలోనే ఇజ్రాయిల్ ప్రజలను రక్షించే నిమిత్తమై "మెస్సయ్య" అనేటువంటివాడు వస్తాడని వారి నమ్మకం. ఈ **యూదులకు పవిత్రమైన స్థానం 'జెరూసెలెమ్'.** ఇక్కడ వారివారి మత సిద్ధాంతములను, ఆచారములను పురస్కరించుకొని ప్రత్యేక కార్యక్రమములను జరుపుకొను చుండెడివారు.క్రమక్రమేణా కాలము మారిన కొలది మానవ స్వభావములుకూడా మారుతూ వచ్చాయి. కాలక్రమంలో 'టాంపే' అనే వాడు 'జెరూసెలెమ్' వశపరచుకొన్నాడు. అప్పటినుండి ఈ "జెరూసెలెమ్" రోమన్ వారికి ప్రధాన స్థలమైంది. యూదులు నిరుత్సాహపడక, తమ మతమును పెంచుకోవలెననే తలంపుతో తీవ్రమైన ప్రయత్నం సలుపుతూ వచ్చారు ఆనాటి పరిస్థితుల ప్రభావమును పురస్కరించుకొని రాజులనే దైవంగా విశ్వసించి కొలిచేటటువంటివారు. ఇట్టి పరిస్థితులలో **"జీసస్" అవతరించాడు. ఈ జీసస్ బాల్యమునుండే కరుణ, ప్రేమ, దయ, త్యాగము అనేటటువంటి భావములను ప్రకటిస్తూ వచ్చాడు.** లేతవయస్సునందే కర్తవ్య కర్మలను నిర్వర్తించటం మానవుని ప్రధాన ధర్మమని విశ్వసించి, తండ్రి చేసే పనులయందు ప్రవేశించి వడ్రంగి పనిని నేర్చుకుంటూ వచ్చాడు. కాని దురదృష్టవశాత్తు 12వ సంవత్సరముననే తండ్రి మరణించాడు. కొంతకాలం తన తండ్రి పనినే చేసుకుంటూ, క్రమక్రమేణా తన మనస్సు అభివృద్ధి కావడంచేత, తల్లి వద్ద శలవు తీసుకొని దేశసేవ నిమిత్తమై దేశములో ప్రవేశించాడు. పూవుపుట్టగనే పరిమళం అభివృద్ధి గావించినట్లుగా, ఈ పిల్లవానియందు పవిత్రమైన భావములు ప్రకాశిస్తూ వచ్చాయి. **ఈ పిల్లవాడు జన్మించినప్పుడు అరేబియన్**

**రాజులుకూడా అతనిని చూడటానికి వెళ్ళారు. ఇందులో ముగ్గురు మూడు విధములైన భావములను ప్రకటించారు. మొదటి వ్యక్తి పిల్లవానిని చూచి "ఈ పిల్లవాడు భగవంతుని ప్రేమించేవాడుగా రూపొందుతాడు" అని తనలో తాను చింతించాడు. రెండవ వ్యక్తి "పరమాత్ముని యొక్క ప్రేమకు ఈ పిల్లవాడు గురికావచ్చును." అని తలిచాడు. మూడవ వ్యక్తి "తానే పరమాత్మునిగా ఈ పిల్లవాడు ప్రకటించుకోవచ్చు" అని తలిచాడు. "ఈ పిల్లవాడు భగవంతుని ప్రేమించవచ్చును" అని తలచు కోవటమే "Messenger of God' ' అని అర్థం. భగవంతుడే ఈపిల్లవాడిని ప్రేమించవచ్చు" అని తలచుకోవటమే "I am the Son of God" అని అర్థం. ఈ పిల్లవాడే భగవంతుడు కావచ్చును" అని అనుకోవటమే "I and My father are One" అని అర్థము.**

కనుక ఈ Messenger అనేటటువంటివాడు ఎలాంటివాడు? తన తత్వాన్ని మాత్రమే తాను గుర్తించుకోవటం. The one you think you are (నీవనుకుంటున్న నీవు). రెండవది " I am the Son of God" అనేది the one others think you are (ఇతరులు భావించేనీవు). ఇతనే దైవస్వరూపుడుగా వుండవచ్చును. మూడవది "I and My father are One " అనేది The one you really are (నిజంగా నీవైపు నీవు) అనే సత్యాన్ని ప్రబోధిస్తూ వచ్చారు. ఈ విధమైన ప్రబోధనలను ఏసుక్రీస్తు ప్రచారం సలుపుతూ వచ్చాడు. కారణ కర్మ కర్తవ్యాలను పురస్కరించుకొని కొంతమంది వ్యక్తులవల్ల అనేక మార్పులు సంభవిస్తూ వుంటాయి. అన్ని మతముల యందునూ కూర్పులూ, మార్పులూ జరుగుతూ వుంటాయి. ఈ క్రిష్టియన్ మతమునందుకూడనూ ఇలాంటి కూర్పులు మార్పులు సంభవిస్తూ వచ్చాయి. రోమన్ కాథలిక్కులు చర్చికిపోయే విషయాల లోపల అనేక మార్పులు జరుగుతూ వచ్చాయి. రోమన్‌లకు కాథలిక్ చర్చి అనేది చాలా ప్రధానమైనది. దీని అధిపతికి "బిషప్" అని పేరు పెట్టారు. జర్మన్ దేశస్థుడైన ఒక సన్యాసి "మార్టిన్ లూథర్" 1517 సం.లో క్రిష్టియన్ మతములో కొన్ని సంస్కరణలు చేసి నూతనమైన మార్గమును అవలంబించాడు. "ఈస్ట్రన్ ఆథరెడ్స్" అని పేరుపెట్టి వారి లోపలకొన్ని విధములైనటువంటి యజమానులను నియమించి అతన్నే **"పోప్"** అనే రూపుతో ఒక అధికారత్వాన్ని చలాయిస్తూ వచ్చారు. ఒక్క ప్రక్క జీసస్ ప్రభావం దినదినానికి అభివృద్ధి కావిస్తూ వచ్చింది. దయ, కరుణ, ప్రేమ,త్యాగం అనేనాలుగు ప్రబోధనలచేత ప్రజల ప్రేమను చూరగొంటూ వస్తున్నాడు. ఈ రోమన్ దేశంలో క్రిష్టియన్ మతం క్రమక్రమేణ పెరుగుతూ వచ్చింది. పూర్వం జీసస్ అనేటటువంటి పేరునకు, ఈ క్రీస్తు పేరు లోపల క్రైస్తు అనే పదమునకు ఉండి నటువంటి సన్నిహిత సంబంధ బాంధవ్యాన్ని గుర్తింప జేస్తూ వచ్చారు. క్రైస్తు **అనగా అభిషక్తుడైనటువాడని అర్థము. అనగా ఎన్నుకోబడినటువంటివాడని. ఈ దివ్యమైనటువంటి వ్యక్తిని ఎన్నుకోడం చేతనే ఇతనికి**

**"క్రైస్తు" అని పేరు పెట్టారు. ఇతనిని అనుసరించే వారందరిని క్రైస్తవులన్నారు. అప్పటి రాజైన 'కాన్‌స్టెంటైల్' కూడను ఈ మతమును అధికార మతముగా గుర్తిస్తూ వచ్చాడు.** ఈ విధంగా మతం అభివృద్ధి గావటం చేత అనేకమందిలో అసూయ భావములుకూడా అభివృద్ధి అవుతూ వచ్చాయి. ప్రతి మతమునందు ఇలాంటివి జరుగుతునే వుంటాయి. వ్యక్తిత్వమనే తత్త్వం అర్థం చేసుకోవటం చాలా కష్టం. ఈ విధమైన కలతలు ప్రారంభం కావటం చేతనే మానవత్వంలో వుండినటువంటి దివ్యత్వం క్రమక్రమేణ మాలిన్యం చెందుతూ వచ్చింది. మానవునియొక్క వాంఛలన్నియు కూడను విషయాలపై ప్రసరింపజేస్తూ వచ్చారు. ఎడారిలో ప్రయాణంచేసే వ్యక్తి దాహంవల్ల ఎండ మావులనే నీరని భ్రమించి దాని వెంట పరుగెడుతూ వుంటాడు. క్రమక్రమేణా దారి తప్పి, సమీపించే కొలదీ, అది జలము కాదనే సత్యాన్ని గుర్తించి నిరుత్సాహంతో కృంగిపోతాడు. అదే విధముగనే మానవుడు విషయాసక్తుడై విషయములయందు ఆనందము కలదని విశ్వసించి, దానిని వెంటాడుతూ వెళ్ళి, కట్టకడపటికి తన సత్యాన్ని తాను గుర్తించుకొని, నిరాశకు, నిస్పృహకు గురి అవుతూ వస్తుంటాడు.

## జీసస్

జీసస్ మొట్టమొదట తాను దేవుని దూతనని చెప్పుకున్నాడు. క్రమక్రమేణ అంతరాత్మ తత్వాన్ని గుర్తించి, "నేను దేవుని కుమారుడను" అన్నాడు. తాను భగవంతుని కుమారుడైనప్పుడు భగవంతుని ప్రాపర్టీలో తనకు హక్కు ఉంటుంది కదా! కనుకనే భగవత్సంబంధమైన సదాలోచనలు, సచ్చింతనలు, సద్గుణములు ఆతనిలో ఆవిర్భవిస్తూ వచ్చాయి. ఈ ఆస్తి ఎప్పుడు లభ్యమైందో తండ్రియైన భగవంతుడుతన ఆస్తినంతా కుమారునికి అప్పజెప్పాడు. అప్పుడు జీసస్ అందులోను, ఇందులోను ఉన్నది ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించి, "నేను, నా తండ్రి ఒక్కటే" అన్నాడు. **అదే ఏకాత్మభావము.**

## జొరాస్టర్ - పర్షియనులు

అదేవిధంగా పర్షియన్ మతప్రవక్తయైన జోరాస్టర్ కూడా మొదట 'నేను వెలుగులో ఉన్నాను' (I am in the light) అన్నాడు. అనగా భగవంతుడు స్వర్గములో ఉన్నాడనీ, అతని వెలుగులో తాను జీవిస్తున్నాననీ భావించాడు. తరువాత బయట కనిపించునదంతా రిఫ్లెక్షన్ ఆఫ్ ది ఇన్నర్ బీయింగే అన్న సత్యాన్ని గుర్తించి, 'వెలుగు నాలో ఉన్నది' (The light is in me) అన్నాడు. చిట్టచివరికి, 'నేను వెలుగును' (I am the light) అన్నాడు. **ఈ మూడింటినీ ద్వైత విశిష్టాద్వైత అద్వైత సిద్ధాంతములతో పోల్చవచ్చును.**

పర్షియనుల యొక్క ప్రాచీనమతమైన జోరాష్ట్రియను మతమును స్థాపించిన వారు జోరాష్ట్రరు. ఆయన బోధలలో అగ్నిదేవుడు కేంద్రస్థానములో ఉంటాడు. భగవంతుని యొక్క ఈ చరాచర సృష్టిలో ప్రతివస్తువు కూడా చివరకు అగ్నికి ఆహుతై భస్మమవుతుంది. అలాగే మానవ శరీరము కూడా, దీనికి తిరుగులేదు. ప్రాపంచికమైన కోర్కెలను ఆధ్యాత్మిక జ్ఞానమనే అగ్నిలో దగ్ధము చేసి బూడిద చేయవలెనని దీని యొక్క అంతరార్థము. నిషిద్ధమైన ఆలోచనలను, కోరికలను దగ్ధం చేసి భస్మము చేసే నిమిత్తమై నిరంతరము మన హృదయాలలో ఆ పవిత్రాగ్ని వెలుగుతూ ఉండాలని ఆయన బోధిస్తూ వచ్చారు. మనలో నిరంతరం వెలుగొందే ఆ పవిత్రాగ్ని యొక్క వెలుగు కిరణాలు మనలోను, మనచుట్టూను ప్రసరించి, ఆ కాంతి అంతటా నిండి పోవాలి.

## ఇస్లామ్

ఇస్లామ్ మతమునకు చంద్రుడు, నక్షత్రము ప్రధానమైన చిహ్నములు. దీనిని హిందువులు కూడా అను సరిస్తున్నారు. "చంద్రమా మనసో జాతః" మనస్సు అనేది చంద్రుడని చల్లగా, తెల్లగా ప్రకాశిస్తూ సర్వులకు శాంతి భద్రతలు కల్పించేది అని దీనికి సరియైన అర్థము.

హజరత్ మహమ్మద్ వాక్యాన్ని అనుసరించి ఈనాటికి రంజాన్ నెల మొదటి చంద్రుని దర్శనముతో ప్రారంభించి రెండవ చంద్రుని దర్శనముతో ఉపవాసదీక్షను విరమిస్తుంటారు మహమ్మదీయులు.

ఖురాన్‌లో అందరూ ఐకమత్యముతో, ప్రేమతో అన్యోన్యమైన అనురాగముతో దైవత్వమును మాత్రమే చింతించాలని ఉంది. ఆధునిక యుగములో దేహసంరక్షణ నిమిత్తమై దినమునకు ఐదు పర్యాయములు మానవుడు భుజిస్తున్నాడు. అస్థిరము, అశాశ్వతము అయిన దేహము కోసము 5 పర్యాయములు మనము భుజిస్తుంటే, నిత్య సత్యమైన ఆత్మ తత్వమునకు కూడా ఆహారమును అందించవలసిన అవసరము లేదా అని ఇస్లామ్ వాదిస్తుంది. ఆత్మ ప్రకాశమునకు కూడా ఆహారము అవసరమని చెప్పింది. ఏమిటి ఈ ఆహారము? ప్రార్థన, 5 పర్యాయములు ప్రార్థన చెయ్యాలి. బుద్ధి వచ్చి బాలుడు మొదలుకొని, అంతిమ శ్వాస విడువనున్న వృద్ధునివరకు రోజు ఐదు పర్యాయములు ప్రార్థన విధిగా చెయ్యాలని ఇస్లామ్ నిబంధన. అందు లో ఏకాంత ప్రార్థన కేవలము స్వార్థ పరమైనదని సామూహిక ప్రార్థన సరియైనదని కూడా ఇస్లామ్ బోధించింది.

**ఎంత ద్వేషము, విరోధ మున్నప్పటికీ - ఒకరిమీద ఒకరు కక్షలు సాధిస్తున్న వారుకూడా సమాజమునందు ప్రార్థనలోనూ, అంత్యసమయములోనూ ఏకము కావాలని ఇస్లామ్ శాసించింది.** ఏకాభిప్రాయమును ఆచరించి అనేకత్వములో ఉన్న ఏకత్వాన్ని నిరూపించడమే ఇస్లామ్ పరమ లక్ష్యము.

దీక్ష ఇస్లామ్‌కి మాత్రమే పరిమితమైనది కాదు. హిందువులు కూడా మాఘమాస వ్రతమని, శ్రావణమాస వ్రతమని ఒక్కొక్క మాసమునందు ఒక్కొక్క వ్రతమును పాటిస్తుంటారు. అదేవిధముగ ఇస్లామ్ మతమేకాక, పర్షియన్ మతమునందు, జోరాష్ట్ర మతమునందు, క్రైస్తవ మతమునందు ఒక్కొక్క మాసములో ఒక్కొక్క ఉపవాస దీక్షను అనుసరిస్తున్నారు. ఈ విషయాన్ని అర్థము చేసికొనక, భేదాభిప్రాయములను పెంచుకొని కక్షలకు దిగుతున్నారు. అన్ని మతములు ఐకమత్యమునే బోధిస్తున్నాయి. ఐకమత్యములేని మతము మతము కాదు. దైవము అన్నిటియందు ఒక్కటిగా ఉంటూ ఒకే మార్గాన్ని బోధిస్తున్నాడు.

**ఇస్లామ్ మతము నీతి, నిజాయితీలను నిరూపిస్తూ వస్తున్నది.** భగవంతుని ప్రసన్నుని గావించేవి పాండిత్యము గాని, ధనము గాని, దేహశక్తులు గాని కావు. నీతి నిజాయితీలతో కూడిన ప్రేమే భగవంతుని ప్రసన్నుని గావిస్తుందని ఇస్లామ్ చెప్పింది. పవిత్ర ప్రేమను ప్రతి మతము కూడా బోధిస్తున్నది. అయితే ఈనాడు మనము ప్రేమ తప్ప అన్నింటిని అనుసరిస్తున్నాము: ఈ రంజాన్ సమయములో దూరపు బంధువులంతా చేరుతుంటారు. ద్వేషమున్న వారంతా ఏకమై పోతుంటారు. ఇదంతా కూడా మానవత్వ ఏకత్వాన్ని నిరూపించడం కోసం. **మసీదు దాని కొక చిహ్నము. దేహజీవతత్వాలను విసర్జించి ఆత్మతత్వాన్ని స్థిరముగా నిలుపు కోవడమే అమరత్వమునకు చిహ్నమని ఈ రంజాన్ దిన సందేశము.** అనిత్యమైన దేహ భావములను, జీవితత్వాన్ని సాధ్యమైనంత వరకు అదుపులో పెట్టుకొని, సత్యమైన ఆత్మతత్వమును ప్రకటింప జేయడానికి, ప్రకాశింప చేసు కోవడానికి తగిన కృషి చెయ్యడమే రంజాన్ అంతరార్థము. **దీనిని గుర్తించి నేటినుండీ, ఏ మతమైనా, అన్నీ సమత్వాన్ని గురించి చెప్పేవే గనుక - అందరూ ప్రేమను సహనాన్ని, సానుభూతిని సత్యమును ప్రకటించుకోవాలి.**

## రంజాన్

హజరత్ మహమ్మద్ అల్లాను ప్రార్థన చేస్తున్న సమయములో ఆయనకు కొన్ని శబ్దములు వినిపిస్తూ వచ్చాయి. తాను విన్న సుశబ్దములను హజరత్ మహమ్మద్ మక్కాలో శబ్ద సంభాషణలక్రింద చాటుతూవచ్చాడు, కాని అక్కడ చాలామంది నానా కష్టములు పెట్టి చివరకు అతనిని మక్కానుండి తరుమగొట్టారు. ఎన్ని హింసలు పెట్టినప్పటికీ సత్యమే జయిస్తుందని, దైవమే రక్షిస్తాడని, ఆత్మ నిరంతరము సుఖస్వరూపమైనదని చివరి ఘడియ వరకూ బోధించినాడు మహమ్మద్. అట్టి మహమ్మద్ సుసూక్తులను ఆచరణలో పెట్టి, దివ్య స్థానమును పొందే నిమిత్తమై ఈ రంజాన్ ఉపవాసదీక్షను మహమ్మదీయులు స్వీకరించారు.

## ఖురాన్

ఆత్మతత్వాన్ని గుర్తింప చేయడానికై, అన్ని మతములందు మహనీయులు ఆశరీరవాణిని శ్రవణము చేస్తూ వచ్చారు. ఏ విధముగా వేదముల నాదమును సారస్వతుడు విని సర్వులకు బోధించాడో అదే విధముగ ఇస్లాము మతములో కూడా **హజరత్ మహమ్మద్ పదునాలుగు వందల సంవత్సరములకు పూర్వము ఈ వాణిని 'ఖుర్ ఆన్' రూపములో పొందుపరచాడు. దీనిని 'ఖురాన్' అని అంటారు.** కాని దీని సరియైన స్వరూపము 'ఖుర్ ఆన్' రూపములో పొందుపరచాడు. ఇందులోని రెండు పదములు **'సలాత్', 'జకాత్'** లను, రెండు నేత్రములుగా **హజరత్ మహమ్మద్** నిరూపించాడు. 'సలాత్' అనగా ప్రార్థన, 'జకాత్' అనగా దానధర్మములు. **దానము, ధర్మము, స్మరణ, ప్రార్థన.** వీటిని ఆచరించే సమాజ ధర్మమునకు **"ఇస్లామ్"** అని **పేరు పెట్టారు. ఇస్లామ్ అనేది కేవలము ఒక మతమునకు మాత్రము సంబంధించినది కాదు. దీనికి అరబీ భాషలో శరణు. శాంతి అని అర్థము, ఎవరు భగవంతునకు శరణాగతులై నిరంతర శాంతితో తోటి మానవులతో జీవించడానికి పూనుకుంటారో అట్టి సమాజమే ఇస్లామ్. ఏకత్వములోని అనేకత్వాన్ని విస్మరించి. దివ్యత్వమైన దైవత్వాన్ని స్మరించే సమాజము ఇస్లామ్.**

## మతబాంధవ్యము

అన్ని మతాల్లోనూ సూక్తులూ సూత్రాలు దాదాపు ఒకేరకంగా వుంటాయి. మతాలపరస్పర సంబంధాన్ని యిది సూచిస్తుంది.

**మతములన్నీ పరస్పర సుహృద్బాంధవ్యములు కలిగి ఉన్నాయి.** అగుటచే వాటినన్నింటినీ కూడా ఆహ్వానించు మతాలన్నీ మానవుల్ని భగవన్మార్గంలో నడుచునట్లు అభ్యసింపచేసే ప్రయత్నాలు మాత్రమే. మతాలన్నీ మంచి పనులను చేయడంద్వారా మనస్సును పవిత్రీభూతం చేసుకొని తద్వారా పరమాత్మ సాక్షాత్కారం పొందాలని ఆశిస్తాయి. **సర్వమతముల ఆంతర్యమూ వేదాంత తత్వముయొక్క సనాతన ధర్మమే.** ఆసనాతనధర్మము సాధకుడు తన ఆధ్యాత్మికస్థాయినీ అర్హతలనూ పురస్కరించుకొని భగవత్తత్వాన్ని సాక్షాత్కరింప చేసుకొనుటకు వీలుగా సాధ్యమైనన్ని మార్గాలను క్రమపద్ధతిలో ఏర్పాటు చేస్తుంది. **మొదట వేదమతం ఉద్భవించింది. 2500 ఏళ్ళ కిందట వచ్చినది బౌద్ధ మతము. వైదిక ధర్మాన్ని ప్రపితామహునిగానూ, బౌద్ధమతాన్ని పుత్రునిగానూ, క్రైస్తవాన్ని పౌత్రునిగానూ, ఇస్లామును ప్రపౌత్రునిగానూ అభివర్ణించవచ్చు. వీటిమధ్య అభిప్రాయబేధమేమైనా వస్తే అది కుటుంబ సమస్య మాత్రమే. మనమందరమూ భాగస్వాముల మైన ఆ పిత్రార్జితపుటాస్తి అంతా ఒకటే.**

**అన్నింటిలోను ప్రధానంగా కనిపించేది ప్రేమ. మనిషిని మనిషిగా చేసి దివ్యత్వంవైపు నడిపించేది ఆప్రేమే!**

మతము మతముకు మధ్య ద్వేషము-జాతి జాతికి మధ్య జగడము
దేశదేశములందు రగడలు-దేనికయ్యా! మత ప్రబోధలు
కన్నువిప్పి చూడరోరన్నా- ఈసాయి దేవుని
ఎన్నగా ఎందైన గలడన్నా:
మొన్న షిరిడీ నేడు పర్తీ-ఉన్నవాడని పేరెగాని
తన్ను భావనచేయు భక్తుల-కన్నులందే మెలగునన్నా!
భారతదేశమ్ము నారింజపండు,
కనగ జాతులు మతములు తొనలుగానె
భిన్నతెగలు వృత్తులు ఎన్నియున్న
భారతదేశాన్ని పుట్టుట భాగ్యమగును,
ఐకమత్యంబు జ్ఞానంబు నందజేయు
దివ్యజ్యోతిని వెలిగించి దేశమిదియె॥

## రెలిజియన్

బ్రహ్మసత్యాన్ని గుర్తించాలి. దీనిని గుర్తించాలనుకున్నప్పుడు బ్రహ్మ తత్త్వాన్ని చింతించాలి. తెలుసు కొనుటకు ప్రయత్నించాలి. దీనితో సంభాషించటానికి ప్రయత్నించాలి. **అదే నిజమైన రెలిజియన్. మ్యాన్ మస్ట్ రియలైజ్ గాడ్, ఫీల్‌గాడ్, సీగాడ్, టాక్‌గాడ్, దిస్ ఈజ్ రియలైజేషన్. మానవుడు మొట్టమొదట గుర్తించవలసినది దైవత్వాన్ని.** దానిని తెలుసు కొనకుండా ఎన్నింటిని తెలుసుకున్నప్పటికిని ప్రయోజనము లేదు.

## మానవుడు కాడు

**"ఏకం సత్ విప్రాః బహుధా వదంతి". దేవుడు ఒక్కడే. కనుక, నీ దేవుడు, నా దేవుడు అనే భేద భావములకు చోటివ్వకండి.** కొందరు తమకు రాముడంటేనే ఇష్టమంటారు, కొందరు కృష్ణుడంటేనే ఇష్టమంటారు, కొందరు శివుడంటేనే ఇష్టమంటారు. కొందరు సాయిబాబా అంటేనే ఇష్టమంటారు. ఇవన్నీ కేవలం అల్పబుద్ధుల యొక్క లక్షణాలు. **దైవం ఒక్కడే, అతడు సర్వాంతర్యామి. ఈ సత్యాన్ని చక్కగా గుర్తించండి. మీరు క్రిష్టియన్లు అయితే నిజమైన క్రిష్టియన్లుగా తయారు కండి; హిందువులైతే నిజమైన హిందువులుగా తయారు కండి;** ముస్లింలైతే నిజమైన ముస్లింలుగా తయారు కండి. మీ ప్రవర్తన మానవుడనే పేరుకు తగినట్లుగా ఉండాలి.

కాడు మానవుండు ప్రేమయే లేకున్న
కాడు క్రైస్తవుడు, కాడు సిక్కు
కాడు హైందవుండు, కాడు ముస్లిమ్
వాడె రాక్షసుండు వసుధపైన!

ప్రేమస్వరూపులారా! **రాముడు "జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అన్నాడు. దేశము తల్లి, సంస్కృతి తండ్రి. కనుకనే, జన్మభూమిని Mother land అంటారుగాని, Father land అనరు.** భారతీయ సంస్కృతి తల్లికి ఇంత ప్రాధాన్యత ఇచ్చింది. తల్లి ప్రేమతత్త్వానికి అనుక్షణమూ జ్ఞప్తియందుంచుకొని ఎలాంటి పరిస్థితి యందైనా తల్లిని సంతోషపెట్టడానికి ప్రయత్నించండి. **తల్లి సంతోషపడక నేను సంతోషపడను. తల్లిని సంతృప్తిపరచితే నాకు కూడా సంతృప్తే!**

## ఉపాసన/ఉపాసనలు

వైదికోపాసన : ఇది నాలుగు విధములుగ వున్నది. (1) సత్యవతి (2) అంగవతి (3) అన్యవతి (4) నిదానవతి అని.

**"సర్వవ్యాపిన మాత్మానం క్షీరేసర్పిరివార్పితమ్"** పాలలో నెయ్యి కలసివున్నట్లే ఆత్మ సర్వవ్యాప్తమై ఉన్నదనే భావముతో చేసే సాధనే **సత్యవతీ ఉపాసన** అంటారు.

**"మాయాతీత మిదం సర్వం జగదవ్యక్తమూర్తినా"** నేనీ సమస్తంలో అవ్యక్తంగా వ్యాపించివున్నాను. నన్ను అంతటా నాలో అంతటినీ చూస్తూ ఉండే సత్యవతి ఉపాసకునకు నేను కనిపించకుండా ఉండను. నాకు ఆ ఉపాసకుడు కనుపించకుండా ఉండడు అంటూ ఉన్నాడు మాధవుడు.

**ఆ సర్వాత్మనే నిప్పు, గాలి, సూర్యుడు, చంద్రుడు (మొదలైన వన్నీ) అనే భావముతో చేయబడే అంగవతీ ఉపాసన.** ప్రాణరూపమై అందరికీ ఆత్మీయమైన ఆ గాలి అన్నింటినీ వెలిగించు అగ్ని ప్రాణములకు వివిధ జీవనాధారములైన అన్నము ఉత్పాదనచేయటానికి కావలసిన వరుణ (వర్షము) అని పరమాత్మను పొగుడుట **అంగవతీ ఉపాసన.**

**"శంఖచక్రగదాపాణి"** అని విష్ణువును, "ఏకదంతగజాననా" అని విఘ్నేశ్వరుని, "శూలపాణి" అని ఈశ్వరుని, "కోదండపాణి" అని రాముణ్ణి, "శిఖిపింఛమౌళి మురళీధర" అని కృష్ణునీ, "వీణాపాణి" అని సరస్వతిని ఇలా ఆయా **దేవతల చిహ్నములను ధ్యానపూర్వకంగా మనస్సును తన్మయము చేసుకొని హృదయంలో ఆరాధిస్తూ ఉండటం అన్యవతీ ఉపాసన** అని అందురు.

"శ్రవణం, కీర్తనం, విష్ణోఃస్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మనివేదనం తన్మయాసక్తి, పరమ విరహాసక్తి" అని పదకొండు **భక్తిసాధనలు కూడా నిదానవతీ ఉపాసనలో చేరును.**

సత్యవతీ, అంగవతీ, అన్యవతీ. నిదానవతీ ఉపాసనలు అనుక్రమేణా ఒకదానికంటే ఒకటి అత్యుత్తమ స్థితికి కారణా లై విశ్వనియంతతో తాదాత్మ్యాన్ని ప్రసాదిస్తాయి.

**ప్రతీకోపాసన** అని మరొకటి ఉన్నది. అది అంగవతీ ఉపాసన లాగానే. ప్రతిరూపోపాసన: - "సర్వతః పాణిపాదం తత్ సర్వతోక్షి శిరోముఖమ్", ఆత్మయైన మాధవునికి అంతటా చేతులూ, కళ్ళూ; చూస్తాడు, ఆలోచిస్తాడు, తింటాడు, వింటాడు. **సర్వోన్నత ఆదర్శభావముతో ప్రతిరూపోపాసన జరుగుతూ వుంటుంది.**

**భానోపాసన:** - మంచి గుణములన్నింటినీ మాధవుని లో అమితంగా వుండినట్లు చూడటమే.

**గీతోపాసన:** - భారతం పంచమ వేదం. అది ఐహిక అముష్మిక ధర్మాలనిధి. మాధవుడు భారతదేశ ధర్మక్షేత్ర రంగస్థలంలో తన నాటిక సామగ్రిని దింపుకొని ఆడిన అద్భుతమైన ఆట, మహాభారతము. భారత నాటకానికి పాత్రధారులును, మాటలను, పాటలను సమకూర్చిన రచయిత, నటకుడు, దర్శకుడు, నిర్మాత అంతా ఒక్క మాధవుడే. ఒకవైపున అధర్మవృద్ధమైన అపార భౌతిక బలం, మరొకవైపున ధర్మవృద్ధమైన పరిమిత ఆత్మబలం. ఈ రెంటిఘర్షణలో పర్యవసాన రూపమైన ధార్మిక విజయ జ్యోతిగా తనను నిర్దేశించుట, ఇదే భారతామృత సర్వస్వం, అదే భగవద్గీత. మహాభారత సారాంశమంతయూ భగవద్గీతలో ఉన్నది. **"కరిష్యే వచనం తవ" నీవు చెప్పినట్లే చేస్తాను. "స్వధర్మే నిధనం శ్రేయః"** ఇదే ఐహిక తత్వానికి గీటురాయి. సర్వశ్రేయస్సులను ప్రవహించే భక్తిని నిర్లక్ష్యము చేసి కళ్ళు మూసుకొని "అహం బ్రహ్మాస్మి" అనే అహంకారముతో బాధపడే నకిలీ బ్రాహ్మలకు క్లేశమే ఫలితము. పొట్టుదంచితే బియ్యము రాదుకదా: **అసలుబ్రహ్మయే కృష్ణుడు.**

**చైతన్యోపాసన:** - శ్రీకృష్ణ చరణాసక్తి, భక్తిలేనిదే జీవన్ముక్తి మాట అటుంచి కనీసం బుద్ధి శుద్ధం కావటం కూడా అసంభవము అని అంటాడు చైతన్యుడు, మునులూ, ఆత్మారాములు అయినవారికి లౌకిక గ్రంథాలు లేక పోయినా సూదంటురాయిలాంటి శ్రీహరి కల్యాణ గుణగణ విశేషంవల్ల నిష్కామంవల్లా భక్తిపారవశ్యం వారికి కలుగుతూ వుంటుందట. ఆ పారవశ్యముతో సిగ్గూ, బిడియాలు వదలి బిగ్గరగా శ్రీహరి నామ సంకీర్తనం, చేస్తూ గగుర్పాటుతో, కంటిధారలతో నృత్యంచేస్తూ అసలైన ఆనందాన్ని అనుభవిస్తూ వుంటారు. శ్రీచరణులు ఈ విశ్వాన్ని పావనం చేస్తూవుంటారు. ఈ విధంగా పరానురక్తితో నామసంకీర్తనలలో, ప్రధానంగా కలిగింది. చైతన్యుల ఉపాసన, **నామసంకీర్తనలలో, తన్మయత్వంతో నృత్యం చేస్తూ తదాత్మ్యభావముతో నిలిచి వుండుట ప్రధానలక్ష్యము.**

**గౌడీయోపాసన:** - అవ్యక్త పురుషోత్తమ రూపములో కృష్ణపరమాత్మను, వ్యక్త పరాశక్తి ప్రకృతిరూపములో రాధను దర్శనము చేస్తూ ఈ కలిలో రాధామాధవ నామసంకీర్తన చేస్తూవుంటే పొందే ఆనందమే కేవలము మోక్షము అంటారు గౌడపాదాచార్యులు. ఆయన సనాతన గోస్వామి. ఆపరమాత్మ ఆనందరస స్వరూపుడు. ఆ రసాన్ని పొందితేనే ప్రాణికి నిజమైన ఆనందం కలుగుతుంది. అనే శ్రుతి వచనానుసారం - **ఆ రసానంద నిధిని అనుభవించాలంటే శ్రీ రాధామాధవ నామమే శరణ్యం అంటారు.**

**నింబార్కాచార్యులు** - ద్వైతోపాసనలో పురుషప్రకృతి సంబంధం వలెనే, జీవాత్మ పరమాత్మ సంబంధంగా భావించి ఉపాసించా లంటారు. వల్లభాచార్యులు. శుద్ధాద్వైతోపాసనలో **"కృష్ణస్తు భగవాన్ స్వయం" - కృష్ణభగవానుడు స్వయంగా పరమాత్మ. ఆ సర్వాత్మను పొందటమే శుద్ధాద్వైతమోక్షము.**

**శైవోపాసన** - "లింగం సర్వకాలం" పృథివ్యాధి తత్త్వాల స్థితి గతులకు మూలకారణమైన **లింగము. అదే పరమశివస్వరూపం. ఆ యిష్ట లింగప్రాప్తినే మోక్షము అని అంటారు.**

**శివాద్వైతోపాసన** - జీవాత్మ తనను కర్తగాను, భోక్తగాను భావించుకొని ప్రకృతి బద్ధుడు అవుతున్నాడు, శివప్రాప్తి కలిగితేనే జీవునకు మోక్షము కలుగుతుంది, అంటే, శివైక్యత కలుగుతుంది అంటారు. వీరశైవోపాసన - (జంగములు) **ఒక ఈశ్వరుడుతప్ప వేరు యేమీ లేదంటారు. ఈశ్వర విభూతిని (శక్తి ) పొందటమే ముక్తి అంటారు.**

**పాశుపతోపాసన** - జీవుడు ప్రకృతి గుణాలనే పాశాలతో కట్టివేయబడిన పశువు. ఆ పశువుకూ, ఆ పాశాలకూ, ఆ ప్రకృతికీ నియంత పరమేశ్వరుడు. అందుకే **పశుపతిని పొందటమే ముక్తి అంటారు.**

**శాక్తోపాసన : - "సర్వదేవమయీ దేవీ" ఆదిపరాశక్తి సర్వదేవమయి.** ఈ వివిధ విచిత్ర రూపములకు నామములకు కారణమైన ప్రకృతియే మాయాశక్తి. ఈ శక్తి కలిగినవాడే మహేశ్వరుడు. ఈ జంట అవయవాలతో ఈ నింగి, నేల నిండిఉన్నై. **అవ్యక్తంగా పురుషరూపంలో వున్న పరమేశ్వరతత్త్వమే వ్యక్తంగా స్త్రీ రూపములో మాయగావున్న పరాశక్తి. ఆమే జగన్మాత. అమ్మలగన్న యమ్మ.** ఆ పరాశక్తి మనలో స్వాభావికమై తెలిపినా బలముగా, క్రియగా అనుభవమౌతుంది.

**జైనోపాసన:** - జైనులు (మార్వాడీలు) వైష్ణవ ప్రాధాన్యంగా వుంటుంది. శంఖచక్రధారుడైన విష్ణుభగవానుని ప్రతిమలు దేవాలయములలో పూజిస్తారు.

ణమో అరి హరితాణమ్ ణమో సిద్ధాణమ్:
ణమో అయిరియాణమ్ ణమో ఉనఝ్ఝాయాణమ్:
ణమో లోప సబ్య సాహూణమ్
ఇవే జైనుల మంత్రాలు.

కామాది వైరులను జయించే మహావీరులకు, సిద్ధులకు, ఆచార్యులకు, ఉపాధ్యాయులకు **లోకములో వున్న సర్వసాధువులకూ నమస్కారములు. ఈ పంచనమస్కారములూ**

**పాపపరిహారం చేస్తాయి. ఈ మంత్రధారిణి సర్వశుభం. ఈ మంత్ర భావంలోనే ముక్తి పొందాలంటారు జైనులు.**

సిక్కులు: **సాంప్రదాయోపాసన ఆత్మతత్త్వోపదేశాన్ని చేసే గురువునూ, ఆయన ఉపదేశాల సమ్మేళనమయిన "గ్రంథసాహెబు" నూ పూజిస్తూ, కీర్తిస్తూ ఉండటమే పరమధర్మం.** భారతీయ సంప్రదాయంలో సిక్కు సంప్రదాయము అంతర్భావం.

**క్రైస్తవోపాసన - ఏసుప్రభువే రక్షకుడు.** తెలిసియో, తెలియకనో పాపాలు చేయటం మనిషికి పరిపాటి. మానవుల పాపాలను తొలగించి పరిశుద్ధులను చేయడానికి ఏసుప్రభువు శిలువపై రక్తాన్ని చిందించాడు. ఆ **ప్రభువునూ, ఆయన ఉపదేశాలనూ, "బైబులు" అనే మతగ్రంథములోని సూత్రాలను ఆచరిస్తూ ఉపాసిస్తూ ఉండటమే మనిషికి మంచి దారి.** క్రైస్తవోపాసనలో స్తోత్రము చేయటమే ముఖ్యంగా ఉపాసనా నియమం.

**మహమ్మదీయోపాసన - ఈమాన్‌దారీ ఖైదామే తో - పైగంబర్ మే భరోసా.** ఆత్మవిశ్వాసం కలిగి ఉండటం దైవముపై సర్వభారము పెట్టియుండటం, దైవశక్తి అడుగడుగునా గుర్తించుచూ ఉండటం - ఇవి లోకములో ప్రధాన నియమాలు. దేహత్యాగం చేసిన తరువాత పరలోకంలో దేవుని దర్బారులో తన వాస్తవికతను నిరూపించుకొనటం అంటే - అందుకు తగిన రుజువర్తన జీవితాంతంవరకూ కలిగియుండటం. **దైవవాణియైన ఖురాను గ్రంథబోధనలను అక్షరాల ఆచరించటం.** ఇవి మహమ్మదీయోపాసనలో పారలౌకిక నియమావళి.

**"అల్లా హో అక్బర్" "లా యిలాహ్" "ఇల్లల్లాహ్" - ఇవి మహమ్మదీయుల ప్రధాన మంత్రాలు.** (భగవంతుడు సర్వోత్తముడు. అంతకంటే మించిన విశ్వనియంత లేడు. అతడే ఆరాధించ తగినవాడు అని ఈ మంత్రముయొక్క అర్థము)

నాకంటే మించినది లేదు. **"నా పర మస్తి కించిత్ " అనే భగవద్గీతార్థము.** మహమ్మదీయ మంత్రార్థానికి సామ్యాలే. అందువలన మహమ్మదీయ సంప్రదాయముకూడా భారతీయ హైందవ సంప్రదాయములో అంతర్ భాగమే.

ఈ విధంగా మానవుడు ఆత్మపరిశోధనకు **ప్రారంభించి నప్పటినుండీ తరతరాల నరజాతికి తారకమైన అనంత విజ్ఞాననిధిగా ఎరింగిన భారతీయుల సంస్కృతి అనంతగంభీరం కావటంవల్ల, భిన్న భిన్న సంప్రదాయల రూపాలలోనదులెన్ని వచ్చిననూ, చేరిననూ పొంగక, కృంగక ధర్మసీమలో నిలచియున్నది.**

అంతేకాక విశ్వాత్మకమై సార్వభౌతికమై సర్వకాలికమై, పెంజీకటి కవ్వల నేకాకృతియై వెలిగే విజ్ఞాన విజయ జ్యోతియై వెలుగుచున్నది. ఇట్టి **పవిత్రమహా సాంస్కృతిక క్షేత్రమైన భారత ధాత్రిమీద మనిషిగా పుట్టుటకంటె సుకృతము లేదని తెలిసికోగలిగిన, మనిషికి కలిగే ఆనందం అపారం.**

## పరమాత్ముడు ఒక్కడే

అల్లాయందు మహమ్మదీయులు జహోవా యందు సత్క్రైస్తవుల్
పుల్లాబ్జాక్షుడటంచు వైష్ణవులు శంభుండంచు శైవుల్ సదా
ఉల్లాసంబున గొల్వ నెల్లరును నాయుర్భోగ భాగ్యాది సం
పల్లాభంబు లొసంగి బ్రోచు పరమాత్ముండొక్కడే చూడుడీ!
విష్ణువే గొప్పని వైష్ణవు లనుచుండ
శంభుండు గొప్పని శైవు లనగ
గణపతి గొప్పని గాణాపత్యులు పల్క
శారద గొప్పని చదువరు లన
అల్లా ఘనుం డనుచు అల్ల తురకలు చెప్ప
క్రీస్తుయే గొప్పని క్రైస్తవు లన
బుద్ధుడే గొప్పని బౌద్ధు లనుచుండ
మహావీరుడే గొప్పని జైనులనగ
జోరాష్ట్ర గొప్పని పారశీలు చెప్ప
నానక్ గొప్పని సిక్కులనగ
సాయియే గొప్పని బాబా భక్తులు చెప్ప
అంద రొక్కటే యని కొందరనగ
**సర్వమత సమ్మతంబైన దేవు డొక్కడే**
**అతడె సత్యము, అతడె ధర్మము**
**అతడె శాంతియు, అతడె ప్రేమ.**

## సర్వమతముల మూలము

సర్వమతముల మూలము సమస్త శాస్త్రముల సారము,
సర్వమార్గముల గమ్యము, సమస్త జీవుల కీలకము

ప్రేమతత్త్వమే, అదే జీవిత సాధమునకు భద్రమైన
పునాది విశ్వకళ్యాణమునకు విజ్ఞాన జ్యోతి.

## సమన్వయ తత్త్వము

మానవజాతి యొక్క జీవన్మతమునకు నేడు సమన్వయ మెక్కడా కనిపించుటలేదు. సామరస్య సిద్ధాంతములు విస్తరింపజేయవలెను. మతములు వేరు వేరు పేర్లతో నున్నను, సిద్ధాంతములు వేరు వేరయిననూ, వాటిని పాటించక మానవుడిగా విచారించిన అందరూ మానవులేనన్న విషయాన్ని బ్రహ్మసూత్రములో 'తత్తు సమన్వయాత్' సూత్రము సమన్వయింప ప్రయత్నించెను. దురదృష్ట వశమున మతము నందలి పరస్పర విరోధములు మానవ మైత్రి, అంతర్జాతీయ సోదరత్వమునకు అవరోధము కలిగించుచున్నవి. **జగత్తుయొక్క అంతరార్థమును గురించి తమ జ్ఞానము ప్రకటించిన మహాద్రష్టల యొక్క అనుభవములను, భావములనూ, ఈనాటి వారు అంగీకరించుటలేదు. అంగీకరించినచో, కొన్ని మత సిద్ధాంతములు తప్ప మిగిలినవన్నియు సమన్వయత్వమును స్పష్టీకరించుచున్నవి.** వివిధ మతములందు, వివిధ నియమములందు ఒకే భగవంతుడు వ్యవహరింపబడుచున్నాడు. వివిధ యుగములలో వివిధ జాతుల కొరకు వివిధ ప్రవక్తలను భగవంతుడే పంపినట్లు సమన్వయపరుచుచున్నవి అనేక మతములు. నేడు మత పరిస్థితులు ప్రపంచవ్యాప్తములగుటవలన జీవన్మతముల మైత్రీభావము, ప్రామాణికతనూ సామరస్యము లేక సమన్వయము కలుగవలసియున్నది. **మహనీయులందరు పరమాత్మ ప్రతిరూపములు. పరమాత్మయందు వారందరూ ఒక్కటే జాతి, ఒక్కటే దేశము. ఆచారములు, విశ్వాసములు మొదలైన వాని ద్వారా, ఎవరి మత ధర్మములు వారు ఇతరులకు తెలియజేయవలసియున్నను,** అప్పుడే పరమాత్మ సాన్నిధ్యమును, చిత్తశుద్ధితో, నిండుహృదయముతో సమన్వయపరచవచ్చును. **సర్వ ధర్మ హృదయమే ఈ సమన్వయ తత్త్వము.**

## సర్వమతసామరస్యము

**దేవుడు హిందూకాదు. దేవుడు ముస్లింకాదు. దేవుడు క్రిస్టియన్ కాదు. మతానికో దేవుడూ లేడు. దేవుడుకో మతం లేదు. అన్ని మతాలు మార్గాలు. దైవానుగ్రహం. గమ్యం. దేవుడికి కూడా మతాన్ని అంటగట్టే మతోన్మాదులే మతకలహాలకి కారణం. మతబోధకులు తమతమ మతసిద్ధాంతాలను ప్రచారం చెయ్యడంతో బాటు ఇతర మతాలను ద్వేషించడాన్ని ప్రోత్సహించడం వల్లనే మానవులు మతులు చెడి మత విభేదాలు పెంచి మానవత్వాన్ని మంట**

**కల్పుతున్నారు. ఈ సత్యాన్ని చరిత్ర రుజువు చేసింది. ఆచారాలు ఆరాధనా విధానాలు వేరుకావచ్చు. కాని అన్ని మతాలు మంచినే బోధిస్తున్నాయి. "Be good, see good and do good"అన్నదే సర్వమత సిద్ధాంతసారం. ఏ విశ్వాసాన్నీ చలింపజేయడానికి కాని, నశింపజేయడానికి, నేను రాలేదు! కాని, ఎవరి విశ్వాసంలో వారిని స్థిరపరచడానికి వచ్చాను. అందువలన ప్రతి హిందువుని ఆదర్శహిందువుగాను, ప్రతి క్రిస్టియన్నీ ఆదర్శ క్రిస్టియన్‌గానూ, ప్రతి ముస్లింని ఆదర్శ ముస్లింగానూ, అలాగే వివిధ మతస్థులను వాళ్ళవాళ్ల మతాలలో ఆదర్శమతస్థులుగా తీర్చి దిద్దడమే నాధ్యేయం. అన్ని మతాలు దైవ పితృత్వాన్ని మానవ సోదరత్వాన్ని బోధిస్తాయన్న సత్యాన్ని గుర్తు చేసి సర్వమతసమానత్వాన్ని ఆచరణలో ప్రచారం చెయ్యడమే నాలక్ష్యం.**

## ద్వేషించకండి

మన భారతదేశము ఎంత గొప్పదో ఒక్కతూరి మీరు విచారణ చేయండి. ఇది త్యాగభూమి, యోగ భూమి, కర్మభూమి, మహత్తరమైన భూమి. బాబర్ కుమారుడైన హుమాయూన్ ఈ దేశాన్ని పరిపాలిస్తున్న రోజులలో ఒకనాడు బాబర్ అతనికి ఒక ఉత్తరం వ్రాశాడు. "నాయనా! నీవు చాల అదృష్టవంతుడవు కనుకనే, **పవిత్రమైన భారత దేశానికి నాయకుడివైనావు. భారత దేశమును సామాన్యమైనదిగా భావించవద్దు. భారతీయ సంస్కృతిని చక్కగా పోషించు.** భారతీయులకు ఆనందాన్ని అందించు'' అని వ్రాశాడు. మహమ్మదీయులు కూడా భారత దేశాన్ని ఎంతో ప్రీతిగా చూసుకునేవారు. పూర్వం భారత దేశంలో మహమ్మదీయులు, సిక్కులు, హిందువులు అందరూ చక్కని ఐకమత్యంతో ఒక్క కుటుంబంగా జీవించేవారు. కానీ, ఈనాడు ఒకరి నుండి ఒకరు విడిపోతున్నారు. ఉన్నది ఒకే కులము, అదే మానవ కులము; ఉన్నది ఒకే మతము, అదే ప్రేమమతము; ఉన్నది ఒకే భాష, అదే హృదయ భాష ఈ మూడింటినీ దృష్టిలో పెట్టుకుంటే ఎవ్వరినీ మీరు ద్వేషించరు.

## వసుధైక కుటుంబం

**"మానవ జాతినంతటినీ ఏకం చేసి వసుధైకకుటుంబంగా చెయ్యటానికీ, మీ నిజతత్త్వమైన ఆత్మతత్త్వాన్ని మీకు తెలియచెప్పటానికే నేను వచ్చాను... తుచ్ఛమైన, లైకికమైన భౌతిక సుఖాలను, సంపదలను నానుండి ఆశించకండి.... వాటికి బదులు నన్నే మీరు కోరుకోండి....** అందుకు తగిన ప్రయోజనం మీకు తప్పక చేకూరుతుంది.''

## సాయిమతము

"అన్ని మతాలను ఒక్కటిగా చేర్చేది. అన్ని మతాలలోను సామాన్యంగా ఉన్న గొప్ప తనాన్ని గురించి వివరించి తెలిపేదే సాయిమతం"

**"అన్ని మతములు అహింసను, ప్రేమను బోధించును. సాయి మతము సర్వమత సామరస్యమును బోధించును.** అందువలన ఎట్టి భేదభావము పెట్టుకొనక అందరితోను కలసి పని చేయవలెను. నీలో ప్రేమ వున్న నిన్నందరూ గౌరవించెదరు. లోక సంరక్షణార్ధమే నేను వచ్చినది. మీరందరూ పరస్పరానురాగముతో జీవించిన యెట్టి కలతలు వుండవు. అట్టి ప్రవర్తనయే నాకు ఆనందము కలిగించును."

"సర్వే భవంతు సుఖీనః
సర్వే సంతు నిరామయాః
సర్వే భద్రాణి పశ్యంతు
మా కశ్చిత్ దుఃఖ భాగ్భవేత్"

ॐ

భగవాన్ ఆదేశించిన, మనము విధిగా పాటించవలసిన :

# దశ సూత్రములు

1. దేశాభిమానము కలిగి వుండాలి.
2. ఏ మతాన్ని ద్వేషింపక సర్వమతములను గౌరవించాలి.
3. ప్రతి మానవుని సోదరునిగా భావించి ప్రేమించాలి. మనది మానవ జాతి.
4. గృహమును, గృహ పరిసరములను పరిశుభ్రముగా ఉంచుకోవాలి.
5. బిచ్చగాళ్ళను ప్రోత్సహించక ఉపాధి కల్పించాలి. సోమరితనాన్ని పెంచవద్దు.
6. లంచము ఇవ్వవద్దు - పుచ్చుకోవద్దు.
7. జాతి మత భేదభావాలు ఏ మాత్రము పెంచుకోరాదు.
8. ప్రతి సభ్యుడు తన పనిని తనే చేసుకోవాలి. ఇంకోకరితో చేయించుకోరాదు.
9. పాపభీతి, దైవప్రీతి, సంఘనీతి ప్రతివారికి ఉండాలి.
10. ప్రభుత్వ చట్టాన్ని నిబంధనలను ఏ మాత్రము అతిక్రమించరాదు.


## బుక్కపట్టణం స్కూల్లో స్వామి పాడిన ప్రార్థనాగీతము

అహరహ తవ ఆహ్వాన ప్రచారిత
సునిశిత ఉదారవాణి
హిందుబౌద్ధ శిఖ్ఖజైన పారశిక ముసల్మానకిరిస్తానీ
పూరబ్ పశ్చిమ్ ఆసీ
తవ సింహాన వాసీ
ప్రేమ వాహినీ.... ప్రేమ వాహినీ

ఈ విధంగా అన్ని మతములు ఏకమైపోవాలని
స్వామి ఆనాడే బోధించారు

## సర్వధర్మ ప్రార్థన

ఓం తత్సత్ శ్రీ నారాయణ తూ పురుషోత్తమ గురు తూ।
సిద్ధ బుద్ధ తూ స్కంద వినాయక సవితా పావక తూ।
బ్రహ్మ మజ్ద తూ యహోవాశక్తితూ ఏసుపితా ప్రభు తూ।
రుద్ర విష్ణు తూ రామకృష్ణ తూ రహీమ తాఓతూ।
వాసుదేవ గోవిశ్వరూప తూ చిదానంద హరి తూ।
అద్వితీయ తూ అకాల నిర్భయ ఆత్మలింగ శివ తూ॥




- "క్రైస్తవమతచిహ్నమైన సిలువ 'అహం' ను ఖండించి వేస్తున్నది.
- పార్సీమత చిహ్నమైన 'అగ్ని' అన్ని నీచ వాంఛలను దహించివేస్తున్నది.
- బౌద్ధమతచిహ్నము, చక్రము మన బంధమోక్షములకు కారణచక్రము.
- ఇస్లాం మతచిహ్నము 'చంద్రరేఖనక్షత్రము భగవంతుని నియందచంచల విశ్వాసమును సూచించుతుంది.
- ప్రణవమైన 'ఓం' సృష్టిస్థితుల విధానము లన్నింటిని క్రోడీకరించబడిన ఆధ్యాత్మిక విజయము యొక్క చరమ స్థితికి చిహ్నము.



లోకాస్సమస్తా స్సుఖినోభవంతు